క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్
16-10-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక:208

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

రాష్ట్రంలో 3 వేల మంది రైతులు మృతి..

బాధితులకు రూ.5 లక్షలు: హరీశ్ రావు డిమాండ్

తెలంగాణలో 3 వేల మంది రైతులు చనిపోయారని హరీశ్ రావు వెల్లడి

సిద్దిపేటలో 22 కుటుంబాలకు బీమా సాయం అందలేదని వ్యాఖ్య

ఒక్కో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్

ప్రభుత్వం స్పందించకుంటే సీఎం ఇంటి ముట్టడికి హెచ్చరిక



సిద్దిపేట, అక్టోబర్ 15: రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన పథకం నిలిచిపోతే.. కుటుంబ పెద్దను కోల్పోయిన వారు ఎవరిని ఆశ్రయించాలి? రైతు బీమా సాయం అందక ఇబ్బందులు పడుతున్న కుటుంబాల తరపున బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. బాధిత కుటుంబాలకు తక్షణమే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే

- మిగతా 2వ పేజీలో

తెలంగాణకు నీటి, విద్యుత్ కష్టాలు..

పొదుపుగా వాడండి: సీఎం రేవంత్ విజ్ఞప్తి

తెలంగాణకు నీటి గండం.. రైతులకు సీఎం కీలక సూచన

రాష్ట్ర జలాశయాల్లో 209 టీఎంసీలకే పరిమితమైన నీటి నిల్వలు

వచ్చే ఎనిమిది నెలలు అప్రమత్తంగా ఉండాలని సూచన

యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు వేయాలని విజ్ఞప్తి

విద్యుత్ డిమాండ్‌కు అదనంగా 5,000 మెగావాట్ల భారం

సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం సహకరించాలని కోరిన సీఎం రేవంత్



తెలంగాణలో రాబోయే నెలలు నీరు, విద్యుత్ వినియోగం విషయంలో పరీక్ష పెట్టనున్నాయా? ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రం ఎదుర్కొనే పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ అంశంపై ఆందోళన పెంచుతున్నాయి. నీటి నిల్వలు గతేడాదితో పోలిస్తే గణనీయంగా తగ్గాయని వెల్లడించిన ఆయన.. ప్రజలు పొదుపు పాటించాలని, రైతులు పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాలని కోరారు.

- మిగతా 2వ పేజీలో

ప్రజలకు రక్షణ ఏదీ?

కాంగ్రెస్‌పై కవిత ఘాటు విమర్శలు

కాంగ్రెస్ పాలనపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ అసంతృప్తి

కమీషన్ల కోసం అర్హతలేని వారికి పనులు అప్పగిస్తున్నారని ఆరోపణ

బెదిరింపులకు పాల్పడేవారిని వదిలేది లేదని హెచ్చరిక

మహిళా రైతులకు చట్టబద్ధ గుర్తింపు కల్పించాలని డిమాండ్



హైదరాబాద్, అక్టోబర్ 15: ప్రభుత్వం ప్రజల ప్రయోజనాల కోసం పనిచేయాలా? లేక కొందరికి లబ్ధి చేకూర్చడానికే అధికారాన్ని ఉపయోగించాలా? అంటూ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రంలో కొనసాగుతున్న పాలన ప్రజలకు మేలు చేసే విధంగా లేదని విమర్శించారు. గురువారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

- మిగతా 2వ పేజీలో

ఏ ఒక్క స్థానమూ ఖాళీగా ఉండకూడదు

నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు అభ్యర్థులకు అండగా ఉండాలని సూచన

అభ్యర్థులపై ఉన్న కేసుల వివరాలు సులభంగా పొందేలా చూడాలని ఈసీకి వినతి



నారాయణపేటలో దారుణం..

నిద్రిస్తున్న భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భార్య!

28 ఏళ్ల కాపురంలో కలహాలు.. చివరకు భర్తను హతమార్చిన భార్య

వివాహేతర సంబంధం నేపథ్యంలో భార్యాభర్తల మధ్య విభేదాలు

ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో బాలస్వామిపై దాడి

హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

పోలీసుల విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు వెల్లడి

- మిగతా 2వ పేజీలో

టెండర్లలో 15 శాతం కమీషనా?

రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ సంచలన ఆరోపణలు

సీఎంవో కేంద్రంగా కమీషన్ల వ్యవహారం నడుస్తోందని కేటీఆర్ ఆరోపణ

రేడియల్ రోడ్-2 టెండర్లపై బీఆర్ఎస్ నేత ప్రశ్నలు

నిర్మాణ సంస్థ ఎండీ లేఖను సోషల్ మీడియాలో పంచుకున్న కేటీఆర్

బిల్లుల చెల్లింపుల్లోనూ అక్రమాలు జరుగుతున్నాయని విమర్శలు



ప్రభుత్వ ప్రాజెక్టుల టెండర్ల నుంచి కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల వరకు అవినీతి జరుగుతోందంటూ తెలంగాణ రాజకీయాల్లో మరో వివాదం తెరపైకి వచ్చింది. ముఖ్యమంత్రి కార్యాలయమే కమీషన్లు వసూలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఓ నిర్మాణ సంస్థ అధికారి రాసినట్లు చెబుతున్న లేఖను బయటపెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

మహిళలు ఉద్యోగాలు అడిగేవాళ్లు కాదు.. ఇచ్చేవాళ్లు కావాలి: సీఎం చంద్రబాబు



- **విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు**
- **గ్రామీణ మహిళల ఉత్పత్తుల కోసం 'స్వయం ఏపీ' బ్రాండ్ ఆవిష్కరణ**
- **గ్రామీణ మహిళల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ లక్ష్యం**
- **650 స్వయం సహాయక సంఘాలతో విజయవాడలో సరస్ మేళా**
- **డ్వాక్రా సంఘాల వార్షిక టర్నోవర్ రూ.69 వేల కోట్లు**

విజయవాడ, అక్టోబర్ 15: ఒకప్పుడు కుటుంబ అవసరాల కోసం పొదుపు చేసుకున్న మహిళలు.. ఇప్పుడు వ్యాపారాలు నిర్వహిస్తూ వేల కోట్ల రూపాయల

- మిగతా 2వ పేజీలో

సింగరేణి ప్రైవేటీకరణపై మంత్రి కీలక ప్రకటన..

సింగరేణిని ప్రైవేటీకరించబోమని శ్రీధర్‌బాబు స్పష్టీకరణ

ప్రైవేటీకరణపై విపక్షాల ఆరోపణల్లో నిజం లేదని వెల్లడి

గత బీఆర్ఎస్ పాలనపై మంత్రి తీవ్ర విమర్శలు

సింగరేణికి భారీగా బకాయిలు పెట్టారని ఆరోపణ

ఆధారాలు లేని విమర్శలను పట్టించుకోవద్దని కార్మికులకు సూచన



కేటీఆర్‌పై మరో అస్త్రం..

త్వరలో "సిరిసిల్ల చీకటి బాగోతం" బయటపెడతా: వెంకట్ బల్మూరి

కేటీఆర్ హోటల్‌పై గురిపెట్టిన వెంకట్ బల్మూరి.. ఆ లెక్కలేంటని ప్రశ్న

రోజుకు రూ.75 లక్షల ఆదాయం.. కేటీఆర్ హోటల్‌పై కొత్త వివాదం

డెక్కన్ సరాయ్ ఆదాయంపై వెంకట్ బల్మూరి ప్రశ్నలు

పదేళ్లలో రూ.175 కోట్లకు ఎలా చేరిందని నిలదీత

అధికారాన్ని ఉపయోగించి ఒప్పందాలు కుదుర్చుకున్నారని ఆరోపణ





ఏ ఒక్క స్థానమూ ఖాళీగా ఉండకూడదు

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేయడంతో, ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) ఎన్నికల కార్యాచరణను ముమ్మరం చేసింది. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, రాష్ట్రంలోని ఏ ఒక్క స్థానిక సంస్థ స్థానాన్ని కూడా వదలకుండా అభ్యర్థులను నిలబెట్టాలని పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు, సమన్వయ బృందాలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ అత్యంత వేగంగా సాగనున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక, ధ్రువపత్రాల సేకరణ, నామినేషన్లు, ప్రచారం వంటి కార్యకలాపాలన్నీ ఏకకాలంలో పూర్తి చేయాలని సూచించారు. రానున్న 15 నుంచి 20 రోజుల పాటు పరిశీలకులు క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉండి అభ్యర్థులకు మార్గనిర్దేశం చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు తమ కుల ధ్రువీకరణ, నిరభ్యంతర పత్రాలను తక్షణమే సిద్ధం చేసుకోవాలని కోరారు. నామినేషన్ల దాఖలు సమయంలో ఏవైనా ఆటంకాలు ఎదురైతే వాటిని వీడియో సాక్ష్యాలతో సహా నమోదు చేయాలని స్పష్టం చేశారు. మరోవైపు, వైసీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఒక వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ నాయకులు, అభ్యర్థులపై వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల పూర్తి వివరాలు (కేసు నంబర్లు, స్టేషన్ల పేర్లు) తెలియక నామినేషన్ల సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల, ఆధార్ నంబర్ ఆధారంగా అభ్యర్థులపై ఉన్న కేసుల జాబితాను లేదా కేసులు లేవనే ధ్రువీకరణను 24 గంటల్లోగా స్థానిక పోలీస్ స్టేషన్ల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని ఈసీని కోరారు. క్షేత్రస్థాయి బృందాల నుంచి పార్టీ కేంద్ర కార్యాలయం వరకు రోజువారీ నివేదికలు పంపేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు సజ్జల వెల్లడించారు.

సింగరేణి ప్రైవేటీకరణపై మంత్రి కీలక ప్రకటన..

సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేశారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు గానీ, ప్రజలు గానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు పెట్టి ఆర్థికంగా దెబ్బతీశారని విమర్శించారు. అప్పట్లో సంస్థను నిర్వీర్యం చేసిన నాయకులు, ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఆధారాలు లేని విమర్శలను ప్రజలు, కార్మికులు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

నారాయణపేటలో దారుణం..



నారాయణపేట జిల్లా, అక్టోబర్ 15: కుటుంబంలో మొదలైన విభేదాలు చివరకు ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొన్నాయి. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న గొడవలు తీవ్ర రూపం దాల్చడంతో నారాయణపేట జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటనలో భార్యను పోలీసులు విచారించగా, నేరాన్ని అంగీకరించినట్లు అధికారులు వెల్లడించారు.

28 ఏళ్ల వైవాహిక జీవితంలో కలతలు

నారాయణపేట జిల్లా మరికల్ మండలం మద్వార్ గ్రామానికి చెందిన బాలస్వామి (46), తెలపల్లి రాములమ్మకు 28 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, బాలస్వామికి అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందనే విషయం భార్యకు తెలిసింది. దీంతో ఇద్దరి మధ్య తరచూ వివాదాలు తలెత్తేవి.

అర్ధరాత్రి వేళ ఘాతుకం

ఈ క్రమంలో సెప్టెంబర్ 24వ తేదీ రాత్రి బాలస్వామి ఇంట్లో నిద్రిస్తుండగా రాములమ్మ అతడిపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. వ్యవసాయ అవసరాల కోసం ఇంట్లో ఉంచిన పెట్రోల్‌ను ఈ దాడికి ఉపయోగించింది. మంటలతో తీవ్రంగా గాయపడిన బాలస్వామి కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు.

ఆసుపత్రికి తరలించినా దక్కని ప్రాణం

తీవ్ర గాయాలపాలైన బాలస్వామిని మొదట మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స కొనసాగుతుండగానే సెప్టెంబర్ 25న అతడు మరణించాడు.

పోలీసుల విచారణలో కీలక వివరాలు

ఈ కేసుపై డీఎస్పీ నల్లపు లింగయ్య వివరాలు వెల్లడించారు. బాలస్వామి మరణ వాంగ్మూలంతో పాటు ఇతర ఆధారాలను పరిశీలించిన పోలీసులు రాములమ్మను ప్రశ్నించారు. ఈ విచారణలో ఆమె నేరాన్ని అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

కేటీఆర్‌పై మరో అస్త్రం..



హైదరాబాద్, అక్టోబర్ 15: ఒక హోటల్ ఆదాయం రోజుకు రూ.75 లక్షల వరకు ఉంటుందా? పదేళ్లలో వందల కోట్ల రూపాయల వ్యాపారం ఎలా సాధ్యమైంది? బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి ప్రభుత్వ విప్ వెంకట్ బల్మూరి సంధించిన ప్రశ్నలు ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. డెక్కన్ సరాయ్ హోటల్ వ్యాపారానికి సంబంధించి పలు ఆరోపణలు చేసిన ఆయన.. ఈ వ్యవహారంపై కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రూ.5 కోట్ల నుంచి రూ.175 కోట్లకు ఎలా?

డెక్కన్ సరాయ్ హోటల్‌లో రూ.5 కోట్ల షేర్ విలువ పదేళ్ల వ్యవధిలో రూ.175 కోట్ల స్థాయికి ఎలా చేరిందో వివరించాలని వెంకట్ బల్మూరి ప్రశ్నించారు. ఈ అంశంపై తాను వివరాలు సేకరించగా ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. హోటల్‌కు రోజుకు సుమారు రూ.75 లక్షల ఆదాయం వస్తోందని కూడా ఆయన వెల్లడించారు.

అధికారాన్ని అడ్డుపెట్టుకున్నారా?

కేటీఆర్ గతంలో ఐటీ మంత్రిగా, అప్పటి ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన సమయంలో తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని వెంకట్ బల్మూరి ఆరోపించారు. బహుళజాతి సంస్థలపై ఒత్తిడి తెచ్చి, వాటి ఫుడ్, ఈవెంట్స్, సమావేశాలు డెక్కన్ సరాయ్‌లోనే జరిగేలా ఒప్పందాలు కుదిరేలా చేశారని విమర్శించారు. ఈ విధానం ఇప్పటికీ కొనసాగుతోందని ఆరోపిస్తూ, దీనిని కేటీఆర్, ఆయన బృందం నిర్వహిస్తున్న వ్యాపార వ్యవహారంగా అభివర్ణించారు.

చర్చకు సిద్ధమంటూ సవాల్

లేవనెత్తిన అంశాలపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని వెంకట్ బల్మూరి ప్రకటించారు. తన ఆరోపణలకు కేటీఆర్ ధైర్యంగా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. అంతటితో ఆగకుండా, త్వరలోనే కేటీఆర్‌కు సంబంధించి సిరిసిల్లకు చెందిన మరిన్ని విషయాలను వెల్లడిస్తానని హెచ్చరించారు.

టెండర్లలో 15 శాతం కమీషనా?

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో చేపట్టే ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) 15 శాతం కమీషన్ అడుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల అవసరాలను పక్కనపెట్టి, వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కమీషన్ల వ్యవహారం కారణంగా అభివృద్ధి పనులు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.

రేడియల్ రోడ్-2 టెండర్లపై ప్రశ్నలు

హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఆధ్వర్యంలో చేపడుతున్న రేడియల్ రోడ్-2 టెండర్లలో అక్రమాలు జరిగాయని కేటీఆర్ ఆరోపించారు. అర్హత ఉన్న సుశీ ఇన్‌ఫ్రా వంటి సంస్థలను పక్కనపెట్టి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు పనులు అప్పగిస్తున్నారని విమర్శించారు. ఈ ఆరోపణలకు ఆధారంగా ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న లేఖను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు.

బిల్లుల విడుదలకూ ముడుపులేనా?

కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు విడుదల కావాలంటే ముడుపులు చెల్లించాల్సి వస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ తరహా వ్యవహారాల వల్ల మౌలిక సదుపాయాల అభివృద్ధి మందగిస్తోందని విమర్శించారు. రైతుల సమస్యలు, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కంటే వ్యక్తిగత లాభాలకే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియ, కమీషన్ల వ్యవహారంపై కేటీఆర్ చేసిన ఆరోపణలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీశాయి.

ప్రజలకు రక్షణ ఏదీ?

(మొదటి పేజీ తరువాయి)

అధికారాన్ని అడ్డుపెట్టుకుని అనుచరులు, సన్నిహితులకు మేలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. అర్హతలు లేని వ్యక్తులకు కమీషన్ల కోసం పనులు అప్పగిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు, వ్యాపార వర్గాలకు భరోసా కల్పించాల్సిన ముఖ్యమంత్రి కార్యాలయంలోనే అక్రమాలకు చోటు కల్పించడం ఏంటని ప్రశ్నించారు.

బెదిరింపులకు పాల్పడితే ఊరుకోం

కమీషన్ల వ్యవహారంలో ఇతరులను భయపెట్టే చర్యలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని కవిత హెచ్చరించారు. అలాంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

మహిళా రైతులకు చట్టపరమైన గుర్తింపు కావాలి

రాష్ట్రంలో మహిళా రైతుల సాధికారత కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళా రైతులతో పాటు వ్యవసాయ కూలీలకూ చట్టబద్ధ గుర్తింపు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, సామాజిక భద్రతతో పాటు వారికి అందాల్సిన ఇతర ప్రయోజనాలు కూడా చేరేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మహిళలు ఉద్యోగాలు అడిగేవాళ్లు కాదు.. ఇచ్చేవాళ్లు కావాలి: సీఎం చంద్రబాబు

ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములవుతున్నారు. ఈ మార్పును మరింత ముందుకు తీసుకెళ్లి, మహిళలు సొంతంగా ఉపాధి పొందడమే కాకుండా ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరాలన్నదే తమ లక్ష్యమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గ్రామీణ మహిళల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించే దిశగా విజయవాడలో జాతీయ సరస్ మేళా-2026కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆయన శ్రీకారం చుట్టారు.

ఇంటి నుంచి అంతర్జాతీయ మార్కెట్ వరకు..

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు తయారు చేసే వస్తువులకు నాణ్యత ఉన్నప్పటికీ, వాటిని ఎక్కువ మంది కొనుగోలుదారులకు చేరవేయడానికి సరైన మార్కెటింగ్ అవసరం. ఈ సమస్యను అధిగమించేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను తీసుకొచ్చినట్లు చంద్రబాబు ప్రకటించారు. ఈ బ్రాండ్ ద్వారా మహిళల ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడంతో పాటు, అంతర్జాతీయ మార్కెట్లలోనూ విక్రయించే అవకాశాలను కల్పిస్తామని వివరించారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలతో పాటు ఈ-కామర్స్ వేదికలను వినియోగించుకుని తమ వ్యాపారాలను విస్తరించాలని మహిళలకు సూచించారు.



రూ.69 వేల కోట్ల ఆర్థిక శక్తి!

ఆంధ్రప్రదేశ్‌లో 11 లక్షల స్వయం సహాయక సంఘాలకు చెందిన 1.10 కోట్ల మంది సభ్యులు ఉన్నారని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సంఘాలు ఏడాదికి రూ.69 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని వివరించారు. పొదుపు కార్యకలాపాలతో ప్రారంభమైన సంఘాలు క్రమంగా వ్యాపార సంస్థలుగా ఎదుగుతున్నాయని, భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా మారాలని ఆకాంక్షించారు.

650 సంఘాలకు ఒకే వేదిక

విజయవాడలో ప్రారంభమైన జాతీయ సరస్ మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయి. మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడంతోపాటు, ఇతర ప్రాంతాల సంఘాలతో అనుభవాలను పంచుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇది కొద్దిరోజుల ప్రదర్శనకే పరిమితం కాకుండా, గ్రామీణ ఉత్పత్తులకు నిరంతర మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు దోహదపడాలని ఆకాంక్షించారు.

ప్రతి గ్రామంలో ఉపాధి అవకాశాలు

మహిళల భద్రత, ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూనే వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. మహిళల సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకున్నప్పుడే వికసిత్ భారత్ లక్ష్యం సాకారమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 3 వేల మంది రైతులు మృతి..

ఆ కుటుంబాలతో కలిసి ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

బీమా నిలిచిపోవడంపై ప్రశ్నలు

గురువారం సిద్దిపేటలో రైతు బీమా పరిహారం అందని కుటుంబాలతో హరీశ్ రావు సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సుమారు మూడు వేల మంది రైతులు మరణించారని, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోనే 22 కుటుంబాలకు రైతు బీమా సాయం అందలేదని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతు బీమా పథకం ద్వారా లక్షా 28 వేల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించామని హరీశ్ రావు చెప్పారు. ఈ పథకాన్ని కొనసాగించాలని తాను పలుమార్లు కోరినా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని నిలిపివేసిందని ఆరోపించారు.

కొత్త పథకంపై స్పష్టత ఏదీ?

రైతులకు భరోసా కల్పించే కొత్త బీమా పథకం ఎప్పుడు అమల్లోకి వస్తుందో స్పష్టత లేదని హరీశ్ రావు విమర్శించారు. మూడు నెలలుగా బీమా సాయం నిలిచిపోయిన విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి పెట్టాలని కోరారు. కొత్త పథకం వచ్చే వరకు బాధిత కుటుంబాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు లభించాయని ఆయన గుర్తుచేశారు. రైతు బీమాను కొనసాగించకపోవడానికి కారణమేంటని, కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతోనే పథకాన్ని ఆపేశారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

విద్యుత్ సరఫరాపైనా విమర్శలు

రైతులకు గతంలో కేసీఆర్ ప్రభుత్వం రోజుకు 24 గంటల విద్యుత్ అందించిందని, ప్రస్తుతం ఐదారు గంటలు కూడా సరిగా రావడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. విద్యుత్ సరఫరా బాధ్యత ముఖ్యమంత్రిదేనని పేర్కొంటూ, కోతలకు సంబంధించి అధికారులను సస్పెండ్ చేస్తానని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.రైతు బీమా అందని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల తరఫున ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే బాధిత కుటుంబాలతో కలిసి సీఎం ఇంటిని ముట్టడిస్తామని స్పష్టం చేశారు.

తెలంగాణకు నీటి, విద్యుత్ కష్టాలు..

గతేడాది ఇదే సమయంలో తెలంగాణలోని జలాశయాల్లో 400 టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం ఆ పరిమాణం 209 టీఎంసీలకు పడిపోయిందని సీఎం వివరించారు. ఎల్ నినో పరిస్థితులపై మంత్రులతో సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. శాస్త్రవేత్తలు ముందుగా సూచించిన వాతావరణ పరిస్థితులు రాష్ట్రానికి ఇబ్బందులు సృష్టించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. రాబయే ఎనిమిది నెలలు కీలకమైనందున ప్రజలంతా నీటి వృథాను తగ్గించాలని కోరారు.

యాసంగిలో పంటల ఎంపికపై సూచన

నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని రైతులు యాసంగి సాగు ప్రణాళికలను మార్చుకోవాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎక్కువ నీరు అవసరమయ్యే వరికి బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నీటి కొరతను ఎదుర్కొనే పరిస్థితుల్లో ఒక సీజన్ పాటు వరి సాగును వాయిదా వేసుకోవాలని రైతులను కోరారు.

విద్యుత్ వినియోగంపైనా ఒత్తిడి

మరోవైపు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ అవసరం పెరిగిందని ముఖ్యమంత్రి చెప్పారు. సాధారణ డిమాండ్‌కు అదనంగా 5,000 మెగావాట్ల విద్యుత్ అవసరం ఏర్పడుతోందని వివరించారు. అక్టోబర్ నెలలో ఈ స్థాయిలో వినియోగం గతంలో కనిపించలేదని పేర్కొన్నారు. వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులు రాకుండా మార్కెట్‌లో అధిక ధర చెల్లించైనా విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. అదనపు విద్యుత్ కేటాయింపుల కోసం కేంద్రాన్ని ఇప్పటికే కోరినట్లు చెప్పారు. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలని, కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర వాటాను పెంచాలని విజ్ఞప్తి చేశారు.





నేరేడుచర్ల మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా స్పందన రాజీవ్

వైస్ చైర్మన్ గా మునగాల భాస్కర్ రెడ్డి



క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల: నేరేడుచెర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం నేరేడుచర్ల మార్కెట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గా రంగినేని స్పందన రాజీవ్, వైస్ చైర్మన్ మునగాల భాస్కర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. వీరితో పాటు 17 మంది తో కూడిన కూడిన పాలకవర్గం లో డైరెక్టర్లు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకట్ రెడ్డి సభాధ్యక్షత వహించారు. రెండు మండలాల్లోని వివిధ గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు, సర్పంచులు, పార్టీ నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావడంతో మార్కెట్ కార్యాలయం వద్ద సందడి నెలకొంది.మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా ప్రమాణ స్వీకారం చేసిన చలసాని స్పందన రాజీవ్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి రైతుల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూర్నగర్ మున్సిపాలిటీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, నేరేడుచర్ల మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునగాల భాస్కర్ రెడ్డి,మార్కెట్ కమిటీ కార్యదర్శి సన్నీ, పాలకవీడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుబ్బారావు హుజూర్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దేశముఖ్ అరుణకుమార్, పాలకవీడు మాజీ ఎంపీపీ భూక్య గోపాల్, మాజీ జెడ్పిటిసి మోతిలాల్, సీనియర్ నాయకుడు సాముల శివారెడ్డి, గరిడేపల్లి మాజీ జెడ్పిటిసి పెండెం శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు, మార్కెట్ డైరెక్టర్లు, నేరేడుచర్ల మున్సిపాలిటీ కౌన్సిలర్లు, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చండూరు మర్కండేయ ఆలయంలో లలితా త్రిపుర సుందరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

అమ్మవారికి ఇక్కత్ పట్టు చీరెను సమర్పించిన మాస్టర్ వీవర్ కలిమికొండ మహేష్-గిరిజ దంపతులు ..నేడు కుంకుమార్చన, అన్నదానం



చండూరు, క్రైమ్ మిర్రర్ఃచండూరులోని మర్కండేయ ఆలయంలో జరుగుతున్న శ్రీ రాజరాజేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో 5వ రోజు గురువారం అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కర్తలు కలిమికొండ మహేష్-గిరిజ దంపతులు. అలాగే మాస్టర్ వీవర్ కలిమికొండ మహేష్-గిరిజ దంపతులు అమ్మవారికి ఇక్కత్ పట్టుచీరెను సమర్పించారు.

నేడు కుంకుమార్చన,అన్నదానం


ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10గంటలకు కుంకుమార్చన, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. అన్నదాన వితరణకు సహకరిస్తున్నవారు చెరుపల్లి భిక్షమయ్య-శోభ, వారి కుమార్తె డా. హరిణి. కంకణదారులకు అన్నప్రసాద దాత కర్నాటి విద్యాసాగర్-కరుణశ్రీ దంపతులు. నిత్య పులిహోర దాత జూలూరు కృష్ణయ్య-పద్మ దంతపులు. ఇక్కత్ చీరల దాతలు గంజి యాదగిరి-యశోద,జూలూరు ఆంజనేయులు-పద్మ, జూలూరు శ్రీనివాసులు-సునీత, చిలుకూరి శ్రీనివాసులు-రాధిక, పగిడిమర్రి శ్రీనివాసులు-జయలక్ష్మి, చిలుకూరి నర్సింహ్మ-లక్ష్మమ్మ, చెరపల్లి అంజయ్య-యాదమ్మ, కలిమికొండ మహేష్-గిరిజ, పద్మావతి హాండ్లూమ్స్(యేశాల హరీష్.నవరాత్రిలలో నిత్యపూల దండల దాతలు గుర్రం భిక్షమయ్య, కోమటి వీరేశం, అర్చక దాత పాల్వాయి ప్రవంతిరెడ్డి,హోమ సామగ్రి దాత కోడి వెంకటేశం-కళమ్మ, పూజా సామాగ్రి దాత జూలూరు శేఖర్-వరలక్ష్మి, అమ్మవారికి నిత్య లడ్డూల దాతలు ఏలె శ్రీనివాసులు, కోడి శివశంకర్‌వస్తురూపేణ దాతలు కటకం రమేష్, ఏలె శ్రీనివాసులు, జూలూరు వెంకటే0శం, పూజా కార్యక్రమంలో పాల్గొను భక్తులు ఉత్సవ కమిటీ వద్ద పేరు నమోదు చేసుకోవాలని ఆలయ ఛైర్మన్ రావిరాల నగేష్ తెలిపారు. అలాగే అమ్మవారి చీరల వేలం పాటలో ఆసక్తి గల భక్తులు తమ పేరును ఫోన్ నెం. 9985041123, 8885440002, 9885751117, 8142246328లకు సంప్రదించాలని తెలిపారు.



ఘనంగా అజిత్ కుమార్ పుట్టినరోజు వేడుక

చిట్యాల క్రైమ్ మిర్రర్: చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రూపని అజిత్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా గురువారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గోలి నరేష్ ఆధ్వర్యంలో శాలువ సత్కరించి , కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు దేశబోయిన లింగస్వామి , గోలి సాయికిరణ్ ,వడ్డేపల్లి ఉపేందర్ ,కంచుకొమ్ముల విష్ణు, ,రూపనినితిన్ ,వరికుప్పల చింటూ, వరికుప్పల రాము ఆరూరి శివ తదితరులు పాల్గొన్నారు

ప్రగతి నగర్ దుర్గామాతను దర్శించుకున్న రాష్ట్ర, జిల్లా ఓబీసీ మోర్చా నాయకులు



కూకట్ పల్లి, అక్టోబర్ 15(క్రైమ్ మిర్రర్): ప్రగతి నగర్ దుర్గామాత ఉత్సవ కమిటీ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఓ బి సి అధికార ప్రతినిధి కోడిచెర్ల వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నెలకొల్పిన అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర ఓబిసి మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్ , జిల్లా ఓబిసి మోర్చా అధ్యక్షులు శేఖర్ యాదవ్ , కూకట్పల్లి ఓబీసీ మోర్చా కన్వీనర్ వినోద్ కుమార్ గౌడ్, కైతలాపూర్ డివిజన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి బిజెపి సీనియర్ నాయకులు ఐలయ్య, వారితో పాటు ఓబిసి మోర్చా రాష్ట్ర, జిల్లా, డివిజన్ హోదా కలిగిన నాయకులు, ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా మహాలింగాపురం బిడ్డ గండు మనీషా ఆనంద్ రెడ్డి ఎంపిక - హైకోర్టు ఫలితాల్లో సత్తా చాటిన తెలుగు బిడ్డ





మహాలింగాపురం గ్రామానికి గర్వకారణం

సర్పంచ్ మాసన్నగారి రాఘవేందర్ రెడ్డి అభినందనల వెల్లువ

క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి : రంగారెడ్డి జిల్లా, శంకర్ పల్లి మండలం, మహాలింగాపురం గ్రామానికి చెందిన బిడ్డ జాతీయ స్థాయిలో సత్తా చాటింది.మహాలింగాపురం గ్రామానికి చెందిన గండు ఆనంద్ రెడ్డి సతీమణి గండు మనీషా ఆనంద్ రెడ్డి తెలంగాణ హైకోర్టు జూనియర్ సివిల్ జడ్జిగాఎంపికయ్యారు. తెలంగాణ హైకోర్టు ప్రకటించిన జూనియర్ సివిల్ జడ్జిల ఫలితాల్లో మనీషా ఆనంద్ రెడ్డి ప్రతిభ కనబరిచి ఎంపిక కావడం పట్ల గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. న్యాయవిద్యలో ఎంతో కష్టపడి చదివి, ఎన్నో వ్యయప్రయాసలకోర్చి జడ్జిగా ఎంపిక కావడం అంటే మామూలు విషయం కాదని, గ్రామంలోని ఆడబిడ్డలకు, యువతకు ఆమె ఆదర్శంగా నిలిచారని గ్రామ పెద్దలు కొనియాడుతున్నారు.

సర్పంచ్ అభినందనలు: ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాచన్నగారి రాఘవేందర్ రెడ్డి గండు మనీషా ఆనంద్ రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు."మహాలింగాపురం గ్రామ బిడ్డ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం మా గ్రామానికి గర్వకారణం. గండు మనీషా ఆనంద్ రెడ్డి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, ప్రజలకు న్యాయం చేకూర్చాలని, న్యాయవ్యవస్థలో తనదైన ముద్ర వేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని సర్పంచ్ రాఘవేందర్ రెడ్డి ఆకాంక్షించారు.గ్రామ పంచాయతీ తరపున, గ్రామ ప్రజల తరపున ఆమెకు, వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఆమె సాధించిన విజయం రాబోయే తరాల విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి

మంద వేణుగోపాల్ రెడ్డి డిమాండ్



చిట్యాల క్రైమ్ మిర్రర్: ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడాన్ని ఆసరాగా చేసుకుని, రైస్ మిల్లర్లు తక్కువ ధరకే వడ్లు కొనుగోలు చేస్తూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంద వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే అదనుగా ప్రైవేట్ వ్యాపారులు, రైస్ మిల్లర్లు సిండికేట్‌గా మారి మద్దతు ధర కంటే చాలా తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. దీనివల్ల అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా, తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు కేంద్రాలను (ఐకేపీ సెంటర్లను) ప్రారంభించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రైస్ మిల్లర్ల దోపిడీకి అడ్డుకట్ట వేసి రైతులనుండి తక్కువ ధరకు కొనుగోలు చేసిన రైస్ మిల్లులపై సివిల్ సప్లయ్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. అదే విధంగా ప్రతి గింజనూ ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతాంగాన్ని రక్షించాలని మంద వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.


GHMC
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
4 | శుక్రవారం | 16-10-2026

అంగరంగ వైభవంగా పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ జన్మదిన వేడుకలు


సర్వమత ప్రార్థనలు.. అభిమానుల అభినందనలు.. గాంధీకి జన్మదిన వేడుకల సందడి







కూకట్ పల్లి, అక్టోబర్ 15 (క్రైమ్ మిర్రర్) : పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం కూకట్‌పల్లిలోని వివేకానందనగర్‌లో ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఆయన నివాసం ఉదయం నుంచే సందడిగా మారింది. ఈ సందర్భంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు ప్రత్యేక సర్వమత ప్రార్థనలు నిర్వహించి గాంధీకి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం మత పెద్దల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు గాంధీని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, పూలమాలలు, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పార్టీ శ్రేణులు, యువకులు, మహిళలు, వివిధ కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున హాజరై శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు గాంధీతో కలిసి ఫొటోలు దిగుతూ సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిమానుల రాకతో ఆయన నివాస ప్రాంగణం కిటకిటలాడింది.గాంధీని కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు వివిధ వర్గాలకు చెందిన ప్రజలు తరలిరావడంతో నివాస పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. అభిమానులు, అనుచరుల సందడి మధ్య జన్మదిన వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి. సర్వమత ప్రార్థనలు, ప్రజల అభినందనలు, అభిమానుల సందడితో వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



ఘనంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ జన్మదిన వేడుకలు

శాలువాతో సన్మానించి, పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపిన పాపిరెడ్డినగర్ నాయకులు

కూకట్ పల్లి, అక్టోబర్ 15 (క్రైమ్ మిర్రర్) : శేరిలింగంపల్లి శాసనసభ్యులు, ప్రజా సేవా కమిటీ (పీఎస్‌సీ) చైర్మన్ అరికెపూడి గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపిరెడ్డినగర్ కాంటెస్టెడ్ అధ్యక్షులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పూలమాల వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారని కొనియాడారు. ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తున్న ఎమ్మెల్యే గాంధీ సేవలు అభినందనీయమని ప్రశంసించారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని శ్రీధర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డినగర్ సీనియర్ నాయకులు ఈ. రెడ్డి దేవేందర్ రెడ్డి, చిట్టిరెడ్డి గోపాల్ రెడ్డి, ఎడ్ల సంపత్ రెడ్డి, డాకురి అక్కిరెడ్డి, కృష్ణారెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నరెడ్ల కల్పన



మంచిర్యాల, అక్టోబర్ 15 (క్రైమ్ మిర్రర్): తెలంగాణ ఉద్యమకారుల సమితి (టీయూఎస్) రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన నరెడ్ల కల్పన నియమితులయ్యారు. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు తొడేటి శంకర్ గౌడ్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.తనకు ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడికి కల్పన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఉద్యమకారులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన గుర్తింపు, ప్రయోజనాలు దక్కేలా తన వంతు కృషి చేస్తానన్నారు. ఉద్యమకారులందరినీ సమన్వయం చేసుకుంటూ తెలంగాణ ఉద్యమకారుల సమితి బలోపేతానికి కృషి చేస్తానని కల్పన తెలిపారు.

సమాజ అభివృద్ధిలో చదువుకున్న యువతది కీలకపాత

అట్టడుగు వర్గాల అభివృద్ధే నిజమైన అభివృద్ధి : ఇబ్రాం శేఖర్



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) దేశ అభివృద్ధిలో యువతది కీలక పాత్ర ఉంటుందని, అందులో చదువుకున్న యువత రెట్టింపు స్థాయిలో నూతన ఆవిష్కరణలతో దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని అందుకు పట్టభద్రులు రెండో ఓటు హక్కును ఆత్మగౌరవం వచ్చే విధంగా వినియోగించుకోవాలని బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ తెలిపారు. పట్టభద్రులు చైతన్యవంతమైన ఆలోచనతో తమకు లభించిన రెండో ఓటు హక్కును ప్రలోభాలకు లొంగకుండా ఆత్మగౌరవం ఉట్టిపడేలా బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని అప్పుడే దేశం అభివృద్ధితో పురోగమిస్తుందని, అభివృద్ధి అంటే పెద్ద పెద్ద నిర్మాణాలు, వాణిజ్య సముదాయాలు, రోడ్ల నిర్మాణాలే కావని నిజమైన అభివృద్ధి అంటే సమాజంలోని అట్టడుగు వర్గాలను అభివృద్ధి పథంలోకి తేవడమే నిజమైన అభివృద్ధి అని, అందుకు అట్టడుగు వర్గాలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తేవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని, అందుకు పట్టభద్రులు తమ ఓటు హక్కు ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని సూచిస్తూ, అంతేకాకుండా రాజకీయ నాయకులు ఆర్థిక సంపాదనలో మన్యవర్ కాన్షిరాం, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం లను ఆదర్శంగా తీసుకుంటే భారతదేశంలో పేదరికం అనేది పది సంవత్సరాలలో కనబడకుండా పోతుందని ఇబ్రాం శేఖర్ తెలిపారు.

బాలానగర్‌లో మాదకద్రవ్యాల కలకలం.. ముగ్గురు అరెస్ట్

7.9 గ్రాముల ఎండీఎంఏ, 26 గ్రాముల హాష్ ఆయిల్ స్వాధీనం

మూడు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రం సీజ్

స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల విలువ రూ.35 వేలు



బాలానగర్, అక్టోబర్ 15 (క్రైమ్ మిర్రర్) : బాలానగర్ ప్రాంతంలో మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగానికి సంబంధించి పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. నర్సాపూర్ ఎక్స్ రోడ్డులోని చెన్నై టిఫిన్స్ ఎదురుగా, తాజ్ దర్బార్ హోటల్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని విశ్వసనీయ సమాచారం మేరకు బాలానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పంచ సాక్షుల సమక్షంలో తనిఖీలు, స్వాధీన ప్రక్రియ చేపట్టారు. ముంబై నుంచి తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడి పోలీసుల వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లాకు చెందిన చిడిగె కృష్ణ అలియాస్ సన్నీ (29) హార్డ్‌వేర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇతను ముంబై నుంచి ఎండీఎంఏ, హాష్ ఆయిల్ తీసుకొచ్చి వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి బిభారే మహమ్మద్ రయాన్ (24) కృష్ణ నుంచి ఎండీఎంఏకు సంబంధించిన మూడు ప్యాకెట్లు కొనుగోలు చేసి తిరిగి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు ఆరోపించారు. ఎస్ఆర్ నగర్‌కు చెందిన హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి మేలం దినకర్ (22) రయాన్‌తో పాటు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే, బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలోని (ఐడీఏ) నిర్మానుష్య ప్రదేశంలో నిందితులు మాదకద్రవ్యాలను వినియోగించినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. రూ.35 వేల విలువైన వస్తువులు స్వాధీనం ఈ కేసులో పోలీసులు 7.9 గ్రాముల ఎండీఎంఏ, 26 గ్రాముల హాష్ ఆయిల్‌తో పాటు మూడు సెల్‌ఫోన్లు, ఒక తూకం యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం అంచనా విలువ రూ.35 వేలుగా పేర్కొన్నారు. ఈ ఘటనపై బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 661/2026గా ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 8(సి) రెడ్‌విత్ 22(బి)(అఐ)(ఎ) కింద కేసు నమోదు చేశారు. అనంతరం ముగ్గురు నిందితులను గురువారం న్యాయస్థానంలో హాజరుపరిచి, న్యాయ రిమాండ్‌కు తరలించినట్లు బాలానగర్ పోలీస్ స్టేషన్ అధికారులు వెల్లడించారు.

ఆదిభట్ల పీఎస్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన శంషాబాద్ జోన్ డీసీపీ

రికార్డులు పరిశీలన.. పెండింగ్ కేసులపై ఆరా

బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదేశం



మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): ఆదిభట్ల పోలీస్ స్టేషన్ ను శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ కు చేరుకున్న డీసీపీకి ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి, సీఐ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది స్వాగతం పలికారు.ముందుగా స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటిన డీసీపీ, పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించాలని సూచించారు. అనంతరం రతన్ టాటా పీజీ కాలేజీ అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వివిధ సెక్టార్ల పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసులు, నేరాల నమోదు తీరును ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు తక్షణ న్యాయం అందేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడవద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటేష్, సైదయ్య, సత్యనారాయణ, సుందరయ్య, నోయెల్ రాజ్, సోమయ్య తదితర సిబ్బంది పాల్గొన్నారు.



బీజేపీ నేతలు రాధే శ్యామ్, కాంచి శివలకు అభినందనలు

పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు అంకితభావంతో కృషి చేయాలి

బాలానగర్, అక్టోబర్ 15 (క్రైమ్ మిర్రర్) : భారతీయ జనతా పార్టీ ఫతేనగర్ డివిజన్ అధ్యక్షుడిగా రాధే శ్యామ్, కూకట్‌పల్లి శాసనసభ నియోజకవర్గ ఇతర వెనుకబడిన తరగతుల మోర్చా సహ కన్వీనర్‌గా కాంచి శివ బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పార్టీ అగ్రనేతలు వారికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్, జిల్లా ఇతర వెనుకబడిన తరగతుల మోర్చా అధ్యక్షుడు శేఖర్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకుడు కాంచి మహేందర్ సమక్షంలో రాధే శ్యామ్, కాంచి శివలకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు సూచించారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీకి మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి విజయాలు సాధించాలని వారు అభిలాషించారు.

బండ్లగూడ, హైదర్షాకోట్ డివిజన్లలో రూ.4.25 కోట్లతో అభివృద్ధి పనులు

యూజీడీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బండ్లగూడ, హైదర్షాకోట్ డివిజన్లలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. స్థానిక ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో సుమారు రూ.4.25 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని బండ్లగూడ 121వ డివిజన్, హైదర్షాకోట్ 123వ డివిజన్‌లలో చేపట్టిన ఈ పనులు పూర్తికావడంతో స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో భాగంగా భూగర్భ డ్రైనేజీ (యూజీడీ), సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. హైదర్షాకోట్ డివిజన్ పరిధిలోని స్నేహిత హిల్స్‌లో రూ.214 లక్షల వ్యయంతో చేపట్టిన యూజీడీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా పద్మావతి కాలనీ ఏ-బ్లాక్‌లో రూ.81.20 లక్షలతో, సీ-బ్లాక్‌లో రూ.130 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ మూడు ప్రాంతాల్లో కలిపి రూ.425.20 లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు రహదారుల నిర్మాణం ద్వారా స్థానికులకు రాకపోకల్లో ఇబ్బందులు తగ్గుతాయని భావిస్తున్నారు. కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడటంతో మురుగునీటి సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉందని, సీసీ రోడ్ల నిర్మాణంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనుల నాణ్యతను పర్యవేక్షిస్తూ, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాలనీలకు చెందిన నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల పనుల పరిశీలన

వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు: జిఎం ఎన్.రాధాకృష్ణ





మందమర్రి టౌన్ అక్టోబర్ 15 క్రైమ్ మిర్రర్: సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్ల సందర్భంగా మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్ ను గురువారం ఏరియా జీఎం ఎన్.రాధాకృష్ణ అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రౌండ్‌లో జరుగుతున్న పనులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం, వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ రోజున మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రౌండ్ మొత్తాన్ని చదును చేసి ప్రాంగణంలో మెరుగైన లైటింగ్ సిస్టమ్, నాణ్యమైన సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తామని అన్నారు.త్రాగు నీటి వసతితో పాటు ప్రత్యేకంగా బతుకమ్మ కొలను ఏర్పాటు చేస్తామని అన్నారు.అలాగే దసరా ఉత్సవాల్లో పాల్గొనేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. బాణాసంచా చూడడానికి వేలాదిమంది రావడం జరుగుతుందని కనుక వెలుగులు నింపే బాణా సంచికలు రంగురంగుల మిరిమీట్లు కొలిపె బాణాసంచికలు నిర్వహిస్తామని తెలిపారు, వెలుగులు నింపే లైటింగ్, సౌండ్ సిస్టమ్‌తో పాటు భద్రత కోసం సెక్యూరిటీ సిబ్బందిని పటిష్టం చేస్తామని అన్నారు.ఆహ్లాదకరమైన సాంస్కృతిక కార్యక్రమాలతో దసరా వేడుకలను వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాలలో సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, మందమర్రి ఏరియా చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ విశేషంగా తరలివచ్చి సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలలో పాల్గొని ఈ ఉత్సవాలను ఆనందోత్సవాల మధ్య విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలోఎస్ ఓ టు జిఎం జి.ఎల్. ప్రసాద్,ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం బాలాజీ భాగవతిజా,డీజీఎం పర్సనల్ సిహెచ్ అశోక్,ఏజీఎం అకౌంట్స్ ఆఫీసర్ ప్రసాద్,ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మురళి డీజీఎం సివిల్ మదీనా భాష, వర్క్ షాప్ డివైస్ సి నరేష్,ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్,నాయకులు సివి రమణ, రాజేశ్వరరావు, సివిల్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లిలో మొబైల్ చోరీ..

అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్ట్..చోరీ కేసును ఛేదించిన పోలీసులు..

ఆరు స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం..తాళం వేసిన ఇళ్లు, దుకాణాలే లక్ష్యం

రూ.80 వేల విలువైన ఫోన్ల రికవరీ

వివరాలు వెల్లడించిన సీఐ చరమంద రాజు



క్రైమ్ మిర్రర్,హుజూర్ నగర్ (మఠంపల్లి) : మఠంపల్లి మండల కేంద్రంలోని మొబైల్ దుకాణంలో చోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర నిందితుడిని మఠంపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి సుమారు రూ.80 వేల విలువైన ఆరు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం హుజూర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చరమంద రాజు కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు.

తాళం వేసిన ఇళ్లు, దుకాణాలే లక్ష్యం

గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన చక్రవర్తి అలియాస్ బాబు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలో ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, చైతన్యపురి పరిధిలో ఒకటి, కోదాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు చోరీ కేసులు నమోదయ్యాయి. 2023లో కోదాడ టౌన్ పరిధిలోని మూడు కేసుల్లో అతడిని అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు సీఐ తెలిపారు.ఇటీవల మఠంపల్లిలోని ఓ మొబైల్ దుకాణంలో నిందితుడు చోరీకి పాల్పడ్డాడు. దొంగిలించిన ఫోన్లను ఇతరులకు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఫోన్లలో వినియోగించిన కొత్త సిమ్ కార్డులు, కాల్ డేటా రికార్డులను విశ్లేషించి నిందితుడి ఆచూకీని గుర్తించారు.మరోసారి నేరానికి పాల్పడేందుకు నిందితుడు మఠంపల్లికి వచ్చినట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి ఆరు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చరమంద రాజు వెల్లడించారు. ఈ కేసు ఛేదనలో మఠంపల్లి ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బీజేపీ నాయకులకు ఘన సన్మానం

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులకు అభినందనలు


క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి): బీజేపీలో వివిధ బాధ్యతలు చేపట్టిన నాయకులను బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ తలకొండపల్లి మండల అధ్యక్షుడు నీలకంఠ పాండు, నాగర్ కర్నూల్ జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షుడు పెరుమాళ్ల రాజు, బీజేవైఎం నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మ అనిల్ ముదిరాజ్‌లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులు మరింత అంకితభావంతో పనిచేయాలని దోర్నాల వెంకటేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు నర్సింహా, నాయిని కుమార్, ఈసారి బాలకృష్ణ, శ్రీను, పుట్ట రాము, ఈసారి ప్రవీణ్, వెంకటేష్, అనుపటి పాండు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

వడ్డే చంద్రయ్యకు బైతి శ్రీధర్ పరామర్శ



గండిపేట(క్రైమ్ మిర్రర్): గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి వడ్డే చంద్రయ్యను ఓబీసీ స్టేట్ సెక్రటరీ బైతి శ్రీధర్ పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వడ్డే చంద్రయ్య సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవనం కొనసాగించాలని బైతి శ్రీధర్ ఆకాంక్షించారు. ఆయన త్వరగా కోలుకుని తిరిగి తన కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన బైతి శ్రీధర్, ఆయనకు ధైర్యం చెప్పారు

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికే మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో మహా అన్నదానం

3 వేల మందికి అన్నప్రసాద వితరణ.. పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





క్రైమ్ మిర్రర్,మిర్యాలగూడ: దేవీ నవరాత్రుల సందర్భంగా నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామంలో బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సూది రెడ్డి శేఖర్‌రెడ్డి, డాక్టర్ శశికళ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 3,000 మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బీఎల్ఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేవీ నవరాత్రుల వంటి ఆధ్యాత్మిక పర్వదినాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. సేవాభావంతో చేపట్టే ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని అన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ బెడదూరి వెంకట్‌రెడ్డి, కంచుగంట్ల లింగయ్య యాదవ్, సజ్జల శ్రీనివాసరెడ్డి,షాగం కర్ణాకర్‌రెడ్డి సజ్జల ,అనంతరెడ్డి, వంచర వీందర్‌రెడ్డి, కాసాని శ్రీనివాస్, కొత్త రవి, సజ్జల రాజీరెడ్డి,ఎర్రబోలు శ్రీనివాస్‌రెడ్డి,గాలి జాన్‌రెడ్డి,మహేశ్వరపు శ్రీనివాస్, తరుణ్‌రెడ్డితో పాటు భవాని మాలధారులు, ఆంజనేయ మాలధారులు, అయ్యప్ప స్వాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే అరికెపూడి కి అభినందనలు



ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి జనంపల్లి పురంధర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

కూకట్ పల్లి, అక్టోబర్ 15 (క్రైమ్ మిర్రర్) : శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పబ్లిక్ సర్వీసెస్ కమిటీ (పీఎస్‌సీ) చైర్మన్ అరికెపూడి గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురంధర్ రెడ్డి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి, మిఠాయిలు తినిపిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జనంపల్లి పురంధర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారని కొనియాడారు. రాత్రింబవళ్లు శ్రమిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రజలతో కలిసిమెలిసి ఉంటూ, వారి సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కమిటీ సభ్యులు జి. నర్సింగరావు, సూర్యనారాయణ, ఉత్తమ్ చౌదరి, వాసుదేవ్, సహకార సంఘం చైర్మన్ రామారావు, లక్ష్మీనారాయణ, గ్రానైట్ సూర్యనారాయణ, నాని తదితరులు పాల్గొని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

దుర్గామాత అమ్మవారి పల్లకి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గణేష్



కూకట్ పల్లి, అక్టోబర్ 15 (క్రైమ్ మిర్రర్) : శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో దత్తాత్రేయ కాలనీలో టీం దేవీ నవరాత్రి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి దేవి నవరాత్రుల సందర్భంగా వారి ఆహ్వాన మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ ఆల్విన్ డివిజన్ పరిధిలోని దుర్గామాత మండపాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం, పల్లకి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించడం, ఈ కార్యక్రమంలో కాలనీలోని మహిళలు, కాలనీ పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనడం సనాతన ధర్మానికి ఇదొక మంచి పరిణామం అని అన్నారు. అమ్మవారిని దర్శనానికి ఆహ్వానించిన కాలనీ పెద్దలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో కాలనీ అధ్యక్షులు నాగభూషణం, యాదగిరి, వీరేశం, అరుణ్, వికాస్, రాజు, రవి, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మధుయాష్కి ని కలిసినఎంవీహెచ్ ఫౌండేషన్ చైర్మన్ వడ్డేపల్లి శ్రీశైలం





చిట్యాల క్రైమ్ మిర్రర్: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్‌కు అఖిల భారత వృత్తి నిపుణుల కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్‌పర్సన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానం ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, తెలంగాణ సీనియర్ నాయకులు, ఎంవీహెచ్ ఫౌండేషన్ చైర్మన్ వడ్డేపల్లి శ్రీశైలం, ఆయన కుమారులు పాల్గొని మధుయాష్కి గౌడ్‌ను సన్మానించారు.



గాంధారిఖిల్లాపై నవరాత్రి శోభ

పంచలోహ దుర్గామాతకు పట్టువస్త్రాలు సమర్పించిన వొడ్నాల శ్రీనివాస్ దంపతులు

మంచిర్యాల అక్టోబర్ 15 (క్రైమ్ మిర్రర్): మంచిర్యాల జిల్లా బొక్కలగుట్ట సమీపంలోని చారిత్రక గాంధారిఖిల్లాపై దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఖిల్లాపై తొలిసారిగా ప్రతిష్ఠించిన పంచలోహ దుర్గామాత విగ్రహానికి క్యాతనపల్లి పురపాలక కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ కుటుంబసమేతంగా పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.అంతకుముందు భక్తులతో కలిసి బోనాల ఊరేగింపుగా ఖిల్లాపైకి చేరుకుని మైసమ్మతల్లికి ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. అమ్మవారి దయతో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, రైతులకు గిట్టుబాటు ధర దక్కాలని ఆకాంక్షించారు. 300 ఏళ్ల చరిత్ర కలిగిన గాంధారిఖిల్లాను రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణల సహకారంతో ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. పర్యాటక ప్రాంతంగా మారితే స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.ఈ కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు కేంద్రంగా పటాన్‌చెరు

మైత్రి మైదానంలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు ప్రారంభం

విద్యార్థుల దినచర్యలో క్రీడలు భాగం కావాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

బందోబస్తు కల్పించడంలో పోలీసుల నిర్లక్ష్యం.. డీజీపీ, సీఎంకు ఫిర్యాదు చేస్తా






పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 15: రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలకు పటాన్‌చెరు నియోజకవర్గాన్ని ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థి దైనందిన జీవితంలో క్రీడలు భాగం కావాలని, క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందుతాయని పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో నిర్వహిస్తున్న 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలబాలికల రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలను గురువారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాలకు చెందిన 200 మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. క్రీడాకారులకు అవసరమైన మైదానాలు, వసతులు, ఇతర సదుపాయాలు కల్పిస్తూ పటాన్‌చెరును క్రీడారంగంలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. క్రీడలు, క్రీడాకారులకు తన సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీలకు సైతం పటాన్‌చెరు ఆతిథ్యమివ్వనుందని వెల్లడించారు. కుస్తీ పోటీల నిర్వహణకు తగిన పోలీసు బందోబస్తు కల్పించలేదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్‌లు, నిర్వాహకులు హాజరయ్యే ప్రతిష్ఠాత్మక పోటీలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో నిర్లక్ష్యం తగదని, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర డీజీపీతో పాటు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరైన క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలను తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. క్రీడాకారులకు అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేపట్టారు. పటాన్‌చెరులో క్రీడా మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేసి స్థానిక ప్రతిభకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. కుస్తీ పోటీల ప్రారంభంతో మైత్రి మైదానం క్రీడా సందడితో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్ నాయక్, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమం

మణుగూరు ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన డి.యం.హెచ్.ఓ..

ఆధార్ ఆధారిత ఓపీ నమోదుతో పాటు వైద్య సేవలపై డాక్టర్ నరేందర్ రాథోడ్ సమీక్ష





మంచిర్యాల, అక్టోబర్ 15(క్రైమ్ మిర్రర్): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని విభిన్న విభాగాలను సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలోని మందుల నిల్వలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ... ఆసుపత్రికి వచ్చే ప్రతీ రోగి వివరాలను ఆధార్ కార్డుతో అనుసంధానిస్తూ ఓపీ నమోదు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా సరఫరా చేసే ఉచిత మందుల వివరాలను ఎప్పటికప్పుడు 'ఈ-ఔషధి' పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయాలన్నారు.

అసంక్రమణ వ్యాధులపై నిఘా

30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ బిపి,షుగర్ వంటి అసంక్రమణ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు.వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, క్రమం తప్పకుండా మందులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ వారంలో రెండు రోజులు తప్పనిసరిగా 'డ్రై డే' పాటించాలన్నారు.

కాన్పులన్నీ సర్కారు వైద్యశాలలోనే..

గర్భవతులను ప్రాథమిక దశలోనే గుర్తించి ఎంసీహెచ్ రికార్డుల్లో నమోదు చేయాలని, నిర్దీత వ్యవధిలో టీకాలు వేయించాలని ఆదేశించారు. ప్రసవాలన్నీ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేలా చూడాలన్నారు. అత్యవసర సమయాల్లో '108' అంబులెన్స్ సేవలను, స్కానింగ్ తదితర అవసరాల కోసం 'అమ్మఒడి' వాహనాలను వినియోగించుకోవాలని సూచించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచి, ఆ ఫొటోలను వెంటనే పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్య రక్షణ

'ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం' సందర్భంగా చేతుల శుభ్రత ప్రాధాన్యాన్ని వివరిస్తూ... పరిశుభ్రత లోపిస్తే అతిసారం, వాంతులు, విరేచనాలు, డయేరియా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ప్రబలే ప్రమాదముందని హెచ్చరించారు. ఆహారం తినే ముందు, శౌచాలయాన్ని ఉపయోగించిన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవడం అలవాటు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, నర్సింగ్ అధికారిణి కవిత, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ఐదో రోజు జయలక్ష్మి దేవిగా అమ్మవారి దివ్యదర్శనం

చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు





గండిపేట/క్రైమ్ మిర్రర్: హైదరాబాద్ సమీపంలోని ముచ్చింతల్ స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ఆధ్యాత్మిక క్షేత్రంలో శరన్నవరాత్రి మహా త్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగు తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం అమ్మవారు జయలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామివారి దివ్య మార్గదర్శకత్వంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు కన్నులపండువగా సాగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల ఆధ్యాత్మిక సందడితో మార్మోగింది. శరన్నవరాత్రుల్లో భాగంగా జయలక్ష్మి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు భక్తిప్రపత్తులతో కొలిచారు. జయలక్ష్మి అమ్మవారి అనుగ్రహంతో విజయాలు, ఐశ్వర్యం, కుటుంబంలో సుఖశాంతులు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా ప్రత్యేక అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి భక్తిపూర్వకంగా సేవలు సమర్పించారు. ఐదో రోజు ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా భూవరాహ ఇష్టి నిర్వహించారు. ప్రకృతి అనుగ్రహం, లోకకల్యాణం కాంక్షిస్తూ వేద పండితులు శాస్త్రోక్తంగా ఈ విశేష యాగ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆధ్యాత్మిక సంప్రదాయాలకు అనుగుణంగా జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు అమ్మవారు ధాన్యలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషంగా లక్ష పుష్పార్చన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని ఆలయ వర్గాలు ఆకాంక్షిస్తున్నాయి. స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తూ, భక్తి పారవశ్యంతో కొనసాగుతున్నాయి.





గాంధారి ఖిల్లా దుర్గాదేవికి క్యాతనపల్లి ఛైర్‌పర్సన్ దంపతుల తొలి బోనం

పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు

మంచిర్యాల అక్టోబర్ 15 (క్రైమ్ మిర్రర్): మంచిర్యాల జిల్లా బొక్కలగుట్ట గ్రామం గాంధారి ఖిల్లాలో నూతనంగా ప్రతిష్ఠించిన దుర్గాదేవి అమ్మవారికి గురువారం క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్‌పర్సన్ దంపతులు తొలి బోనం, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు.అనంతరం చెన్నూరు నియోజకవర్గ నాయకుడు డాక్టర్ రాజారమేష్ మాట్లాడుతూ.. నూతనంగా వెలసిన అమ్మవారికి తొలి బోనం సమర్పించడం సంతోషంగా ఉందన్నారు. గాంధారి ఖిల్లా ప్రాంతాన్ని రాబోయే రోజుల్లో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కష్టకాలంలో కౌన్సిలర్‌కు అండగా ఎమ్మెల్యే కసిరెడ్డి

మబ్బు రామరాజుకు మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక చొరవ

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: అనారోగ్యంతో బాధపడుతున్న కల్వకుర్తి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ మబ్బు రామరాజుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అండగా నిలిచారు. హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామరాజును పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో రామరాజును స్వయంగా నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లి, అక్కడ చేర్పించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. అనంతరం రామరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు యేన్నం భూపతి రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చీమ్ముల శ్రీకాంత్ రెడ్డి, ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ కుటుంబాలకు కేటాయించిన పౌల్ట్రీ ఫారాల భూములను కాపాడాలి

సర్వే నంబర్ 298లో తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు బాధితుల వినతి



గండిపేట(క్రైమ్ మిర్రర్): దశాబ్దాల క్రితం ఎస్సీ కుటుంబాలకు కేటాయించిన పౌల్ట్రీ ఫారాల భూములను పరిరక్షించి, తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధిత కుటుంబాలు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు కేటాయించిన భూముల్లో నివాస గృహాలు నిర్మించుకునేందుకు అనుమతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నంబర్ 298లోని ఎస్సీ బస్తీ పరిధిలో సుమారు 30 పౌల్ట్రీ ఫారాలను 1982 ప్రాంతంలో దళిత కుటుంబాలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి ఆయా కుటుంబాలు ఆ భూముల్లో పౌల్ట్రీ, డెయిరీ ఫారాలు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాయని తెలిపారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఆ భూములతో తమకు అనుబంధం ఉందని, వాటిపైనే తమ కుటుంబాల జీవనాధారం ఆధారపడి ఉందని వివరించారు. ప్రస్తుతం ఆ భూములపై కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తులు, రాజకీయ నాయకులు కన్నేశారని, వాటిని తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధిత కుటుంబాలు ఆరోపించాయి. తమకు కేటాయించిన భూములను కోల్పోతే జీవనోపాధితో పాటు భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశాయి. తమ భూములకు రక్షణ కల్పించి, ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశాయి. భూములపై తమ హక్కులను పరిశీలించి, అర్హతలను పరిగణనలోకి తీసుకొని న్యాయం చేయాలని కోరాయి. తమకు కేటాయించిన పౌల్ట్రీ ఫారాల స్థలాల్లో నివాస గృహాలు నిర్మించుకునేందుకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని బాధితులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కోరారు. ఎన్నో ఏళ్లుగా ఆ భూములపై ఆధారపడి జీవిస్తున్న తమ కుటుంబాలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బాధితుల సమస్యలను విన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సానుకూలంగా స్పందించి, వారికి తగిన న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పత్తి సుధాకర్, పత్తి కరుణాకర్, పత్తి జితేందర్, పత్తి విశ్వనాథం, పత్తి సుధీర్, పత్తి విశాల్, పత్తి కార్తీక్, పత్తి రాజశేఖర్, పత్తి సాయి చైతన్ అలియాస్ బన్నీ తదితరులు ఎమ్మెల్యేను కలిశారు. కేటాయింపుల వివరాలు, భూముల ప్రస్తుత రెవెన్యూ రికార్డులు, హక్కులకు సంబంధించిన పత్రాలను అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది. తమకు న్యాయం జరిగేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.



మణికొండలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

సాగర సంఘం ఆధ్వర్యంలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

గండిపేట(క్రైమ్ మిర్రర్): మణికొండలో సాగర సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మ చుట్టూ ఆడిపాడారు. పండుగ వాతావరణంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. మహిళలంతా కలిసి వేడుకల్లో పాల్గొంటూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో మణికొండ 127వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు కె. సావిత్రి, సాగర మహిళా అధ్యక్షురాలు సునీత, శివగంగ మహిళలు, సాగర సంఘం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా ఈర్ల రాజు ముదిరాజ్

పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, పాత్రికేయ మిత్రులకు కృతజ్ఞతలు

అమీన్‌పూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 15: బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా తనను నియమించిన పార్టీ నాయకత్వానికి ఈర్ల రాజు ముదిరాజ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, ఎమ్మెల్సీ చినమైల్ అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఆదెల్లి రవీందర్, ఎడ్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలుకూరి రాజశేఖర్ రెడ్డి, సహదేవ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ.. బీరంగూడ డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తానని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ బీరంగూడ డివిజన్ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులతో పాటు పటాన్‌చెరు నియోజకవర్గం, అమీన్‌పూర్ మండలం, బీరంగూడ డివిజన్ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. సంగారెడ్డి జిల్లాతో పాటు పటాన్‌చెరు నియోజకవర్గంలోని పాత్రికేయ మిత్రులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.తనకు అందిస్తున్న సహకారం, ప్రోత్సాహంతో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని ఈర్ల రాజు ముదిరాజ్ తెలిపారు. ఇకపై వార్తా కథనాల్లో తనను బీజేపీ బీరంగూడ డివిజన్ అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్గా పేర్కొనాలని పాత్రికేయ మిత్రులను కోరారు.



ఇందిరమ్మ ఇళ్లలో అర్హులైన అయినా వారికే ఇవ్వాలి

పుట్టపాడు గ్రామ సర్పంచ్ బోయిని అంజిలయ్య, ఉప సర్పంచ్ లాల్ బహదూర్ శాస్త్రి

ఎంపీడీఓకు వినతి పత్రం ఇచ్చిన సర్పంచ్ బోయిని అంజిలయ్య



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: కుల్కచర్ల మండలంలోని పుట్టా పహాడ్ గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికి ఇవ్వాలని, పుట్టపాడు గ్రామ సర్పంచ్ బోయిని అంజిలయ్య ఉప సర్పంచ్ లాల్ బహదూర్ శాస్త్రి పేర్కొన్నారు. కుల్కచర్ల మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం వారు నాయకులతో కలిసి మండల అభివృద్ధి అధికారి అందుబాటులో లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్ ఆనంద్ కు వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచి బోయిని అంజనేయ మాట్లాడుతూ పుట్టపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని, గ్రామ సర్పంచికి తెలియకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడం జరుగుతుందని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుండా అనరులకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు ఇస్తున్నారని సర్పంచి తెలిపారు. గ్రామంలో సొంత ఇళ్లు లేనివారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుండా ఇండ్లు ఉన్నవారికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇండ్లు ఇస్తున్నారని, దానిని సర్పంచి అంజయ్య నిలదీసి అడిగితే నీకు సంబంధం లేదని ఎమ్మెల్యే ఎవరికి ఇవ్వమంటే వారికి ఇస్తామని గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బెదిరిస్తున్నారని వారు తెలిపారు. నిజమైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు ఇవ్వాలని,ఎమ్మెల్యే మా గ్రామాన్ని చిన్నచూపు చూడకుండా రెండో విడతలు ఇందిరమ్మాయిలను మంజూరు ఇవ్వాలని వారు సూచించారు. మా గ్రామంలో పార్టీలకు అతీతంగా ఇల్లు లేని వారికి ఇందిరమ్మా ఇళ్లను ఇవ్వాలని ఇల్లు ఉన్నవారికి ఇందిరమ్మాయిలను ఇస్తే పుట్టపాడు గ్రామం నుంచి పెద్ద ఎత్తున ధర్నాలు చేయడం జరుగుతుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ నాలుగదు శాస్త్రి వార్డు సభ్యులు జీ శైలజ శ్రీ అశ్విని బిక్షపతి జే విష్ణువర్ధన్ ఎస్ మారుతి పుట్టపాడు గ్రామస్తులు ఉప్పరి కృష్ణయ్య ఉప్పరి వెంకటయ్య గొల్లమోగులయ్య ఆర్మీ జక్కులపల్లి కృష్ణయ్య జక్కుల రాములు, గాండ్ల వెంకట్ రాములు, కరిగల్ల నరసింహులు సంఘం నరసింహులు, కాకి రాములు, తమ్మలి యాదయ్య గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కష్టకాలంలో కౌన్సిలర్‌కు అండగా ఎమ్మెల్యే కసిరెడ్డి

మబ్బు రామరాజుకు మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక చొరవ

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: అనారోగ్యంతో బాధపడుతున్న కల్వకుర్తి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ మబ్బు రామరాజుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అండగా నిలిచారు. హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామరాజును పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో రామరాజును స్వయంగా నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లి, అక్కడ చేర్పించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. అనంతరం రామరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు యేన్నం భూపతి రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చీమ్ముల శ్రీకాంత్ రెడ్డి, ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారు సమస్త ప్రజానీకాన్ని సుభిక్షంగా చూడాలని

మార్కండేయనగర్ శరన్నవరాత్రి ఉత్సవాలలో ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్



గండిపేట్ : క్రైమ్ మిర్రర్: శరన్నవరాత్రి ఉత్సవాల పూజలందుకుంటున్న ఆ లోకమాత రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని సమస్త ప్రజానీకాన్ని సుభిక్షంగా చూడాలని కోరుకున్నట్లు స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ తెలిపారు. ప్రతి రోజు విశిష్ట రూపాలలో పూజలు అందుకుంటున్న ఆ జగన్మాత భక్తులను తప్పకుండా చల్లగా కాపాడుతుందని ఆయన చెప్పారు. గురువారం రాత్రి మార్కండేయనగర్ లో స్థానిక బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్, నవోదయ యూత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీనివాస్ పంతులు మంత్రోత్సరనల నడుమ శ్రీ లతితా త్రిపుర సుందరీ దేవికి ప్రత్యేక పూజలు చేసి, మహా మంగళ నీరాజనం సమర్పించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్వయంగా వడ్డన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బస్తీ పెద్దలు గద్దె క్రిష్ణ, ఏర్వ సత్యనారాయణ, పగిడిమర్రి సూర్య నారాయణ, విడెం రమేష్ తదితరులతో కలసి మాట్లాడుతూ మార్కండేయనగర్ కాలనీ వాసులు భక్తి పరులని, ప్రతి దైవ కార్యాన్ని ఉత్సవాల రూపంలో నిర్వహిస్తూ ఐక్యతను చాటుతున్నారన్నారు. దేవి మాలాధారణ చేసిన భక్తులు నిత్యం చేసే పూజలు బస్తీలోని ప్రజలందరికి ఆ దుర్గామాత రక్షణ కవచాన్ని అందించనున్నాయన్నారు. పేదలకు అన్నప్రసాదం తీసుకోవడం అమ్మవారు స్వీకరించిన ఫలితాన్నిస్తుందని చెబుతూ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బస్తీ కమిటీ ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్ కుమార్, ఉపాధ్యక్షుడు శిరందాసు నరేందర్, తిరునగ లక్ష్మణ్, నవోదయ యూత్ అధ్యక్షుడు కోట పవన్ కుమార్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. ధనంజయ్, సీనియర్ నాయకులు సరికొండ వెంకటేష్, మామిడిశెట్టి శ్రీనివాస్, బాస శ్రీనివాస్, కళ్లెం లక్ష్మారెడ్డి, మహేష్ గౌడ్. యాంజల శేఖర్ ,జగదీష్ , నవోదయ యూత్ ప్రతినిధులు జి. మల్లేష్, శిరందాసు ప్రభాకర్, కుమ్మరి నరేష్, మూశం నరేష్, భానుచందర్ రెడ్డి, గంజి విజయ్ కుమార్, పి.భాస్కర్, బాత్కు అజయ్ యాదవ్, బాలాజీ, గుర్రం వాసు, గంట వెంకట్, మహేష్, రాజు, సాయి కిరణ్, శివ, మహిళా భక్తులు గద్దె పద్మ, పగిడిమర్రి ఉమాదేవి, గంజి ధనలక్ష్మి, అవ్వారి సావిత్రి, గద్దె భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 | శుక్రవారం | 16-10-2026

పూలను దైవాలుగా కొలిచే పండుగ బతుకమ్మ: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు.. మహిళా ఉద్యోగుల ఆటపాటలతో సందడిగా మారిన ప్రాంగణం







సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 15: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు సంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యానవన, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. మహిళా ఉద్యోగులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ లలితాదేవి, ఉద్యానవన శాఖ అధికారి పి. సోమేశ్వర్‌రావు, టీజీవో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ తదితరులు గౌరీమాతకు, బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, మహిళలను శక్తి స్వరూపిణులుగా గౌరవించే గొప్ప సంస్కృతి తెలంగాణ సొంతమని అన్నారు. పూలను దైవాలుగా కొలుస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తీరొక్క రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను చేతబూని మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మల చుట్టూ సంప్రదాయబద్ధంగా ఆడిపాడుతూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం గౌరీమాతకు, బతుకమ్మలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఏటా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, మహిళా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, కలెక్టరేట్ సమీప కాలనీల వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా తాగునీటి పైపు లీకేజీ.. వృథాగా పోతున్న నీరు

తొండుపల్లిలో అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆవేదన





గండిపేట(క్రైమ్ మిర్రర్): నీటి ప్రతి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు ఒకవైపు అవగాహన కల్పిస్తుండగా, మరోవైపు శంషాబాద్ సర్కిల్ పరిధిలోని 118వ డివిజన్ పరిధిలోని తొండుపల్లిలో తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొండుపల్లిలోని సౌత్ ఇండియన్ బ్యాంక్ సమీపంలో గత నాలుగు నెలలుగా నీటి పైపు పగిలిపోయి ఉండటంతో నిరంతరం నీరు లీకవుతూ వృథాగా పోతోందని చెబుతున్నారు. పైపు పగిలిన ప్రాంతం నుంచి వెలువడుతున్న నీరు సర్వీస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న డ్రైనేజీలోకి చేరుతోందని స్థానికులు తెలిపారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని వాపోతున్నారు. రోజూ పెద్ద మొత్తంలో నీరు వృథా అవుతున్నా అధికారులు స్పందించకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తొండుపల్లిలోని సౌత్ ఇండియన్ బ్యాంక్ సమీపంలో పైపు లీకేజీ కారణంగా నీరు నిరంతరం డ్రైనేజీలోకి ప్రవహిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజలకు అవసరమైన తాగునీరు ఇలా వృథా అవుతుండటంతో నీటి వనరుల పరిరక్షణపై అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నారు. సమస్యను గుర్తించి పైపులైన్‌కు మరమ్మతులు చేపడితే నీటి వృథాను అరికట్టవచ్చని అభిప్రాయపడుతున్నారు. సంబంధిత జలమండలి అధికారులు తక్షణమే స్పందించి లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. పైపులైన్‌ను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజలు పలుమార్లు సమస్యను తెలియజేసినా పరిష్కారం లభించలేదన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నాలుగు నెలలుగా కొనసాగుతున్న నీటి వృథాకు అధికారులు ఎప్పుడు అడ్డుకట్ట వేస్తారో వేచి చూడాలి.

జల్‌పల్లిలో యువకుడు మిస్సింగ్ - ఆటో డ్రైవర్ తో వెళ్లి అదృశ్యం

తిరిగి రాని కుమారుడి కోసం తల్లి ఆవేదన - పోలీసులకు ఫిర్యాదు

గుల్బర్గా వరకు వెళ్లామని ఆటో డ్రైవర్ చెబుతున్న బుకాయింపు - కేసు నమోదు చేసి దర్యాప్తు

మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): రంగారెడ్డి జిల్లా జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని వాడీ-ఎ-ముస్తఫాకు చెందిన యువకుడు అదృశ్యమైన ఘటన కలకలం రేపింది.వాది-ఎ-ముస్తఫా, ఇంటి నం. 8-185కు చెందిన రెహానా బేగం (50) ఇచ్చిన ఫిర్యాదు మేరకు... తన చిన్న కుమారుడు మహ్మద్ ఇద్రీస్ (30, డ్రైవర్) గత నెల 04.10.2026 ఉదయం 8 గంటలకు ఇంట్లో ఉండగా, అదే కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ సాదిక్ (38) వచ్చి తన ఆటోలో తీసుకెళ్లాడు.ఇద్దరూ కలిసి వెళ్లడంతో తిరిగి వస్తాడని ఎదురుచూసినా రాలేదు. అనంతరం 09.10.2026న సాదిక్ ఒక్కడే తిరిగి రావడంతో తల్లి రెహానా బేగం నిలదీయగా, ఇద్దరం గుల్బర్గా వరకు వెళ్లామని, తిరిగి వస్తుండగా కర్ణాటకలోని ఆలీఖేడ్ వద్ద ఆటోలో గ్యాస్ అయిపోవడంతో ఇద్రీస్ తన అక్క రుబీనా ఇంటికి వెళ్తానని చెప్పి వెళ్లిపోయాడని, తాను ఒక్కడినే తిరిగి వచ్చానని చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ వ్యక్తి ఆనవాళ్లు: ముఖం గుండ్రంగా, రంగు తెలుపు, ఎత్తు 5.6 అడుగులు, హిందీ, తెలుగు భాషలు మాట్లాడతాడు.



ఘనంగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



గండిపేట(క్రైమ్ మిర్రర్): భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 95వ జయంతి వేడుకలను రాజేంద్రనగర్ నియోజకవర్గం గండిపేట మండల పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 123వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని కలాం సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పూలపల్లి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణ, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి విశేష కృషి చేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. సాధారణ కుటుంబం నుంచి ఎదిగి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన కలాం జీవిత ప్రయాణం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువత కలాం జీవిత చరిత్రను తప్పనిసరిగా చదవాలి అని ఆయన సూచించారు. కలలు కనడమే కాకుండా, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని కలాం ఇచ్చిన సందేశాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్య, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగుతూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కలాం ఆశయాలు, ఆలోచనలను ఆచరణలో పెట్టి ఆయన అడుగుజాడల్లో దేశ ప్రజలు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తలారి ప్రేమ్‌కుమార్, ఏ బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్, బీసీ సెల్ అధ్యక్షుడు అంకం శ్రీనివాస్ నేత, గ్రామ అధ్యక్షుడు ఎస్. శంకర్, దయాకర్, సుదర్శన్ ముదిరాజ్, లక్ష్మణ్, బాలకుమార్, హరీష్ గౌడ్, బాబు, కట్ట విష్ణు, మదర్ వలి, తుకారం, తలారి రమేష్, మక్బూల్ బాయ్, గాంధీ శివకుమార్, కిట్టు యాదవ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్టేడియంలో దసరా వేడుకలకు భారీ ఏర్పాట్లు

55 అడుగుల రావణాసురుడి దహనం..

ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి





సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 15: పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో దసరా ఉత్సవాల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం పరిశీలించారు. రావణ దహనం కోసం ఏర్పాటు చేస్తున్న 55 అడుగుల రావణాసురుడి బొమ్మతో పాటు బాణసంచా ప్రదర్శనకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గత 30 ఏళ్లుగా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియంలో ఏటా దసరా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. భారీ రావణాసురుడి దహనం, బాణసంచా ప్రదర్శన, ప్రముఖ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది కూడా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ స్టేడియం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ముళ్లకంపలు, చెత్తాచెదారాన్ని తొలగించి మైదానాన్ని సిద్ధం చేయాలని సూచించారు. దసరా వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులు, మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, భవాని యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బెస్త నగేష్, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, కిరణ్ గౌడ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

యువతకు అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు



క్రైమ్ మిర్రర్,నేరేడుచర్ల : భారతరత్న, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ బట్టు మధు, క్లబ్ అధ్యక్షుడు షేక్ యూసుఫ్, ప్రధాన కార్యదర్శి సరికొప్పుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గుండా సత్యనారాయణ, క్లబ్ మాజీ అధ్యక్షుడు సుంకరి క్రాంతికుమార్ తదితరులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాన్య కుటుంబంలో జన్మించిన డాక్టర్ అబ్దుల్ కలాం తన అసాధారణ ప్రతిభాపాటవాలు, కఠోర శ్రమ, పట్టుదలతో దేశం గర్వించదగిన గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగారని కొనియాడారు. భారత రక్షణ, క్షిపణి సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అనంతరం భారత రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టి, తన నిరాడంబరత, ప్రజలతో మమేకమయ్యే స్వభావంతో దేశ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు.కలాం జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ముఖ్యంగా విద్యార్థులు, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. కష్టపడి చదివి, క్రమశిక్షణతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆయన జీవితం నిరూపిస్తోందన్నారు. పదవులు, హోదాలకు అతీతంగా నిరాడంబరంగా జీవించిన కలాం సేవలు, త్యాగనిరతి భావితరాలకు ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, స్థానిక యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఐఐఓఆర్‌లో జాతీయ మహిళా రైతుల దినోత్సవం

నూనెగింజల సాగులో మహిళా సాధికారతకు ప్రోత్సాహం.. ..శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన



గండిపేట(క్రైమ్ మిర్రర్): వ్యవసాయ రంగంలో మహిళా రైతుల భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు, నూనెగింజల సాగు ద్వారా వారు ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రోత్సహించేందుకు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్--భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ (ఐఐఓఆర్) ఆధ్వర్యంలో జాతీయ మహిళా రైతుల దినోత్సవాన్ని నిర్వహించారు. “నూనెగింజల సాగులో మహిళా సాధికారత -- ఆత్మనిర్భరత దిశగా” అనే అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఐసీఏఆర్--ఐఐఓఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కె. మాథుర్ అధ్యక్షత వహించగా, మాజీ ఉద్యానవన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ నీరజా ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సతీష్, సంస్థ శాస్త్రవేత్తలు, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ గొల్లపెల్లి తదితరులు పాల్గొన్నారు. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా రైతులు హాజరయ్యారు. నూనెగింజల పంటల సాగులో మహిళా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉత్పాదకత పెంపునకు అనుసరించాల్సిన పద్ధతులపై ఈ సందర్భంగా చర్చించారు. కుసుమ, నువ్వులు, ఆముదం వంటి పంటల్లో మెరుగైన వంగడాల ఎంపిక, శాస్త్రీయ సాగు విధానాలు, పంటల నిర్వహణ, దిగుబడుల పెంపు, లాభదాయకమైన వ్యవసాయ పద్ధతుల గురించి శాస్త్రవేత్తలు వివరించారు. సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా పంటల ఉత్పాదకతను పెంచుకోవచ్చని తెలిపారు. సాగు ఖర్చులను తగ్గించుకుంటూ నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు పరిశోధనా సంస్థలు సూచించే పద్ధతులను పాటించాలని మహిళా రైతులకు సూచించారు. మహిళా రైతులు వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ, మార్కెట్ అవకాశాలపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. నూనెగింజల సాగులో మెరుగైన పద్ధతులను అనుసరించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రత్నాకర్ గొల్లపెల్లి మాట్లాడుతూ.. పరిశోధనా సంస్థలకు, రైతులకు మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం ద్వారా ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని మహిళా రైతులకు చేరువ చేయవచ్చని తెలిపారు. మహిళా రైతుల సాధికారత, స్థిరమైన వ్యవసాయం, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. వ్యవసాయ రంగంలో మహిళల కృషిని గుర్తించి, వారి భాగస్వామ్యాన్ని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. మహిళా రైతులకు శాస్త్రీయ అవగాహన, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తే వ్యవసాయ ఉత్పత్తి పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. మొత్తంగా, జాతీయ మహిళా రైతుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం మహిళా రైతులకు నూనెగింజల సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు, వ్యవసాయం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ప్రోత్సాహాన్ని అందించింది.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు తోకల శ్రీనివాస్ రెడ్డి సంఘీభావం

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి.. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి





గండిపేట(క్రైమ్ మిర్రర్): వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా శంషాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సేవలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో వారు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని, అలాంటి ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం సమ్మెకు దిగాల్సిన పరిస్థితి రావడం విచారకరమన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, వారి డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని తోకల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. జీఓ 60, 1195 ప్రకారం పెరిగిన వేతనాలను తక్షణమే అమలు చేయాలని, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్, 8 శాతం లయబిలిటీ బోనస్‌ను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు తగిన గుర్తింపు, న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, జేఏసీ ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని తోకల శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంగీత, డాక్టర్ దినేష్, డాక్టర్ శంకర్, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ చేతన్, డాక్టర్ అనూప్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీహెచ్ఓ) డాక్టర్ రాము నాయక్, గిరిజన సంఘం అధ్యక్షులు, డాక్టర్ అమిత్, స్థానిక నాయకులు బత్కు శ్రీనివాస్ యాదవ్, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నీటి పొదుపుతో సాగుకు ప్రోత్సాహం

మాడుగుల మండలంలో 22 మంది రైతులకు స్ప్రింక్లర్ యూనిట్ల పంపిణీ

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (మాడ్గుల): రైతులకు ఆధునిక సాగు పద్ధతులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేలా ప్రోత్సహించేందుకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మాడుగుల మండలంలో 22 మంది రైతులకు స్ప్రింక్లర్ యూనిట్లను పంపిణీ చేశారు. రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలంలోని బ్రాహ్మణపల్లి, ఆసిరెడ్డిపల్లి, పల్లె తండా గ్రామాల్లో ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో బ్రాహ్మణపల్లిలో 10 మంది, ఆసిరెడ్డిపల్లిలో ఐదుగురు, పల్లె తండాలో ఏడుగురు రైతులకు స్ప్రింక్లర్ యూనిట్లు అందజేశారు.స్ప్రింక్లర్ యూనిట్ల వినియోగంతో నీటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చని, పంటలకు అవసరమైన నీటిని అందించడం ద్వారా ఆధునిక సాగు పద్ధతులను ప్రోత్సహించవచ్చని ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ, వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఇబ్రహీంపట్నం డివిజన్ ఉద్యాన శాఖ అధికారి నవీన వెల్లడించారు.

భవానీ నగర్ కాలనీలో శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత - భక్తులకు కనుల పండుగగా అమ్మవారి అలంకరణ

మాసానిగూడ వాస్తవ్యులు సంజీ మహేందర్ శృతి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా అన్నప్రసాద వితరణ: తరలివచ్చిన భక్తులు

క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శంకర్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని భవానీ నగర్ కాలనీలో దుర్గామాత భక్తులకు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో దర్శనమిచ్చి భక్తులను పులకింపజేసింది. అమ్మవారిని లలితా త్రిపుర సుందరి దేవిగా అత్యంత సుందరంగా, కనుల పండుగగా అలంకరించారు. బంగారు చీర, పూలమాలలు, పసుపు కుంకుమలతో అమ్మవారు చూడముచ్చటగా దర్శనమిచ్చారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణం ఘనంగా నిర్వహించారు.భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనంతో కాలనీ మొత్తం భక్తి పారవశ్యంతో మార్మోగింది.



అన్నప్రసాద వితరణ: ఈ పవిత్ర సందర్భంగా మాసానిగూడ వాస్తవ్యులు, దాతలు సంజీ మహేందర్ శృతి దంపతుల ఆధ్వర్యంలోఘనంగా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.దేవీ నవరాత్రులలో అన్నదానం చేయడం మహా పుణ్యమని, వారి సేవను భక్తులు, కాలనీ వాసులు కొనియాడారు. మహేందర్, శృతి దంపతులకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భవానీ నగర్ కాలనీ వాసులు, సంజీ సత్తయ్య, జీ.లక్ష్మయ్య , నర్సింహారెడ్డి,శేఖర్ అప్ప,ముకుందం గౌడ్,బాలాచారి, రఘునందన్ చారి,మహిళా మండలి సభ్యులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బతుకమ్మ, అమ్మవారి విగ్రహాల నిమజ్జనానికి పత్తికుంటలో ఏర్పాట్లు పూర్తి

రాజేంద్రనగర్‌లో చెరువు శుభ్రపరిచి మంచినీరు నింపిన అధికారులు

గండిపేట్‌క్రైమ్ మిర్రర్: బతుకమ్మ పండుగ, విజయదశమి నవరాత్రుల సందర్భంగా అమ్మవారి విగ్రహాల నిమజ్జనానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాజేంద్రనగర్‌లోని పత్తికుంటలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 18వ తేదీ దుర్గాష్టమి సందర్భంగా బతుకమ్మ వేడుకల కోసం పత్తికుంటను శుభ్రం చేసి మంచినీటితో నింపారు. పండుగల నేపథ్యంలో చెరువు వద్ద భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు రాజేంద్రనగర్ డీఈ యాదయ్య ప్రత్యేకంగా పర్యవేక్షించారు. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు వచ్చే మహిళలకు, అలాగే విజయదశమి నవరాత్రుల సందర్భంగా ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాల నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టారు. పండుగల సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున నిమజ్జన ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సంప్రదాయబద్ధంగా పండుగలను నిర్వహించుకునేందుకు అధికారులు చేపట్టిన ఏర్పాట్లపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జిల్లా ఇన్‌చార్జి శ్రీధర్, బీజేపీ నాయకులు జి. బాబురావు, ఈ. వేణుగోపాల్, వై. అభినవ్, కాంట్రాక్టర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించే వరకు బీజేపీ పోరాటం ఆగదు

సంగారెడ్డి విద్యుత్ కార్యాలయం ముట్టడి

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ నేతల ఆగ్రహం

తెలంగాణలో పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 15: రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ సంగారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని నారాయణఖేడ్, ఆందోల్, జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాలకు చెందిన రైతులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు తెలంగాణలో పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు బసవ లక్ష్మీనారాయణ, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని బసవ లక్ష్మీనారాయణ విమర్శించారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలని, రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను తెలంగాణలో అమలు చేసి పంట నష్టాల సమయంలో రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. రైతుల సంక్షేమం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వారి సమస్యలను పరిష్కరించాలని గోదావరి అంజిరెడ్డి అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు విద్యుత్ సరఫరాలోని ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ వారి పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

రైతులకు అండగా ఉంటాం: ఈర్ల రాజు ముదిరాజ్

రైతులు పంటలు పండించేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని, వారికి అవసరమైన విద్యుత్ సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ అన్నారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, వారి సమస్యలను నిర్లక్ష్యం చేయడం తగదని పేర్కొన్నారు.రైతులకు హామీలు ఇవ్వడమే కాకుండా వాటిని అమలు చేసి వారి జీవితాల్లో మార్పు తీసుకురావాలని డిమాండ్ చేశారు. పంట నష్టాలతో రైతు కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా పంటల బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే బీజేపీ ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సమస్యలను అధికారులు, ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. వ్యవసాయం దెబ్బతింటే రైతుల కుటుంబాల జీవనోపాధిపై ప్రభావం పడుతుందని, సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు కొలుకూరి రాజశేఖర్ రెడ్డి, మాణిక్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తిరెడ్డి, జిల్లా నాయకులు కోణం విట్టల్, కొండ లక్ష్మణ్ గుప్తా, మహిళా మోర్చా అధ్యక్షురాలు మీనా గౌడ్, వివిధ మండలాలు, డివిజన్ల అధ్యక్షులు, బీజేపీ నాయకులు కృష్ణ, బాలరాజ్, యాదగిరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ‘జై కిసాన్ -- జై జవాన్’ నినాదాలతో రైతుల సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు.

క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

తెలంగాణ జిల్లాలు

10 శుక్రవారం 16-10-2026



ఘనంగా ఫ్యామిలీ డే, బతుకమ్మ సంబరాలు

జీఎం రాధాకృష్ణ, శ్రీవాణి దంపతుల చేతుల మీదుగా వేడుకలు ప్రారంభం



మందమర్రి, అక్టోబరు 15 (క్రైమ్ మిర్రర్): మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ప్రాంగణంలో ఫ్యామిలీ డే, బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మందమర్రి ఏరియా జీఎం ఎన్.రాధాకృష్ణ, సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు ఎన్.శ్రీవాణి రాధాకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పిల్లలు, స్థానిక ప్రజలు ఒకే వేదికపై కలసి వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగులు వృత్తిపరమైన ఒత్తిళ్లను మరచి కుటుంబ సభ్యులతో కలిసి పండుగ వాతావరణంలో గడపడం సంతోషకరమని పేర్కొన్నారు. మహిళలు బతుకమ్మ ఆటపాటలతో వేడుకలకు ప్రత్యేక శోభ తీసుకొచ్చారని తెలిపారు.2025-26 సంవత్సరంలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ వృత్తి శిక్షణా కోర్సులను పూర్తి చేసిన మహిళలకు ఈ సందర్భంగా ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. మహిళలు, దంపతులకు ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించారు. చిన్నారులు, మహిళలు ప్రదర్శించిన బృంద నృత్యాలు ఆకట్టుకున్నాయి. సంప్రదాయ పద్ధతిలో పూలతో అందంగా పేర్చిన ఉత్తమ బతుకమ్మలకు, వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం మహిళలు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో జీఎంకు ఎస్ఓ జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, సీఎంఓఏ కార్యదర్శి నరేశ్, సీనియర్ పీఓ సురేందర్, ఏరియా అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, సింగరేణి సేవా సమితి ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రముఖ కవి రచయిత బుక్క సత్యనారాయణకు సాహితీ సేవ పురస్కారం



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గజల్ నాయకుడు మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ 50 వసంతాల సంగీత ఉత్సవం 40 వసంతాల గజల్ గాన వేడుకలు 60 వసంతాల తెలుగు గజల్ కు నీరాజనం మహోత్సవం బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గుంటూరు జిల్లా పరిషత్ రోడ్డులోని భారతీయ విద్యా భవన్లో అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకలను గజల్ చారిటబుల్ ట్రస్ట్ ఆంధ్ర ప్రదేశ్ భారతీయ విద్యా భవన్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సభా వేదికపై ప్రముఖ కవి రచయిత నంది అవార్డు గ్రహీత సామాజిక సేవకులు డాక్టర్ బుక్కా సత్యనారాయణకు సాహితీ సేవా పురస్కారం డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వి కృష్ణమోహన్ అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ చైర్మన్ గుమ్మడి గోపాల్ కృష్ణ మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ వేద పండితుడు శివ సాయి శర్మ చేతుల మీదుగా సత్యనారాయణకు సాహితీ సేవా పురస్కారం శాలువతో సత్కరించి ప్రశంసా పత్రం విశిష్ట పురస్కార జ్ఞాపికను అందజేశారు. సత్యనారాయణ తెలుగు భాష కనుమరుగవుతున్న దశలో తెలుగు భాషను అభివృద్ధి చేయాలని సాహితీ సభలు కవి సమ్మేళనాలు వివిధ కార్యక్రమాలు సామాజిక సేవలు వివిధ సంఘాలలో సభ్యులుగా చేరి ప్రభుత్వ కార్యక్ర మాలలు చురుకుగా పాల్గొనడం అతని ముందుండి సాహితీ సేవ లను అందిస్తున్నారు. వీరు కరోనా సమయంలో కరోనా బాధితులకు సేవలు చేయుట అప్పట్లో మరణించిన కరోనా వ్యాధితో మరణించిన వారిని ఖననం చేయుట ఆ జబ్బు రాకుండా ఎలాజాగ్రత్తలు తీసుకోవాలి పాటించాలి అనే విషయంలో ప్రజలను చైతన్యవంతం చేయటం అన్నదానాలు చేయటం పేదవారికి చేతనైన సహాయం పుస్తకాల ముద్రణలో తోటి కవులకు చేతనైన సహాయం అందించటం వీరు ముందంజలో ఉంటారు. ఇంకా వీరు వికాస వేదిక సాహితీ సంస్థ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా కూడా పనిచేస్తూ తోటి కవులను రచయితలను సంఘటిత పరుస్తూ సాహిత్య కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నందుకు గానుఈ సేవలు అన్నిటిని గుర్తించి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గజల్ నాయకుడు మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా సాహితీసేవ పురస్కారం లభించింది. ఈ గౌరవాన్ని అందించిన డాక్టర్ గజల్ శ్రీనివాస్ గజల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు గజల్ కవులకు గాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

'మంచితనం'పై దేశంలోనే తొలిసారిగా అకడమిక్ క్రెడిట్ కోర్సు

ఐఐటీ హైదరాబాద్‌లో వినూత్న కార్యక్రమం ప్రారంభం

ఇప్పటికే 140 మందికి పైగా విద్యార్థుల నమోదు

వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత, మానవ వికాసానికి ప్రాధాన్యం





హైదరాబాద్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 14: విద్యార్థుల్లో విద్యాపరమైన నైపుణ్యాలతో పాటు వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో ఐఐటీ హైదరాబాద్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'గుడ్‌నెస్: క్యారెక్టర్, రెస్పాన్సిబిలిటీ అండ్ హ్యూమన్ ఫ్లోరిషింగ్' పేరుతో ఒక క్రెడిట్ ఎలెక్టివ్ కోర్సును ప్రారంభించింది. భారతదేశంలో మంచితనంపై అకడమిక్ క్రెడిట్ అందించే తొలి కోర్సుగా సంస్థ ఈ కార్యక్రమాన్ని ప్రకటించింది. ఇప్పటికే వివిధ విభాగాలు, విద్యా సంవత్సరాలకు చెందిన 140 మందికి పైగా విద్యార్థులు ఈ కోర్సులో చేరారు.అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులందరికీ అందుబాటులో ఉన్న ఈ కోర్సులో బీటెక్‌తో పాటు బీడిజైన్ విద్యార్థులు కూడా చేరవచ్చు. మంచి జీవితం అంటే ఏమిటి, ఆదాయం, హోదాకు మించి విజయాన్ని ఎలా నిర్వచించాలి, సమాజం పట్ల వ్యక్తుల బాధ్యతలు ఏమిటి అనే అంశాలపై విద్యార్థుల్లో ఆలోచనలను పెంపొందించడం దీని ప్రధాన ఉద్దేశం. మంచితనాన్ని కేవలం ఒక భావనగా కాకుండా రోజువారీ జీవితంలో ఆచరించే విలువగా తీర్చిదిద్దేందుకు ఈ కోర్సు దోహదపడనుంది. ఏడు సెషన్లలో నిర్వహించే ఈ కోర్సులో మానవ వికాసంలోని శారీరక, మానసిక, భావోద్వేగ, సామాజిక, ఆధ్యాత్మిక కోణాలు, వ్యక్తిత్వ నిర్మాణం, వ్యక్తిగత సామాజిక బాధ్యత, మంచితనానికి వికసిత్ భారత్ లక్ష్యానికి ఉన్న సంబంధం వంటి అంశాలను బోధిస్తారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలతో పాటు సమాజానికి అందించగల సానుకూల సహకారంపై ఆలోచించేలా ఈ కోర్సును రూపొందించారు.ఈ కోర్సు ఆలోచనను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్‌నెస్ ప్రతిపాదించగా, ఐఐటీ హైదరాబాద్ అకడమిక్ క్రెడిట్ కోర్సుగా ఆమోదించింది. సంస్థ వ్యవస్థాపకుడు, ఐఐటీ రూర్కీ పూర్వ విద్యార్థి రవి శర్మ ఈ కోర్సును బోధిస్తున్నారు. మంచితనాన్ని కొలవగలిగేలా, బోధించగలిగేలా చేసి విద్యావ్యవస్థలో భాగం చేయడమే తమ లక్ష్యమని ఆయన తెలిపారు. 140 మందికి పైగా విద్యార్థులు స్పందించడం సంతోషకరమని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో భాగంగా ఐఐటీ హైదరాబాద్ మరో కీలక కార్యక్రమాన్ని కూడా ప్రారంభించింది. సంస్థ సన్‌షైన్ కౌన్సెలింగ్ సెల్ సహకారంతో మొదటి సంవత్సరం అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులందరికీ తప్పనిసరిగా ఒక క్రెడిట్ 'మెంటల్ వెల్‌బీయింగ్ అండ్ రెసిలియెన్స్' కోర్సును ప్రవేశపెట్టింది.ఒత్తిడి నిర్వహణ, సమయపాలన, భావోద్వేగ మేధస్సు, ఆరోగ్యకరమైన సంబంధాలు, మానసిక స్థైర్యం, డిజిటల్ శ్రేయస్సు, వ్యసనాల నిర్వహణ, ఆత్మహత్యల నివారణపై అవగాహన వంటి అంశాలు ఈ కోర్సులో ఉంటాయి. విద్యార్థులు సమస్యలను సమర్థంగా ఎదుర్కొనేందుకు, అవసరమైనప్పుడు సహాయం పొందేందుకు, ఇతరులతో ఆరోగ్యకరమైన సంబంధాలు ఏర్పరచుకునేందుకు అవసరమైన ఆచరణాత్మక నైపుణ్యాలను అందించనున్నారు.మంచితనం, మానసిక స్థైర్యం ఒకదానికొకటి బలాన్నిస్తాయని సన్‌షైన్ కౌన్సెలింగ్ సెల్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ నీరజ్ కుమార్ తెలిపారు. విద్యార్థులు వృత్తిపరంగా ఎదగడంతో పాటు వ్యక్తులుగా కూడా అభివృద్ధి చెందేందుకు ఈ కోర్సులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.విద్య అనేది జ్ఞానం, వృత్తిపరమైన సామర్థ్యాలకే పరిమితం కాకూడదని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి అన్నారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వం, బాధ్యత, సమాజానికి సేవ చేయాలనే ఆలోచనలను పెంపొందించడం కూడా విద్యలో భాగమని పేర్కొన్నారు. తమ ఎంపికలు, చర్యలు మెరుగైన సమాజ నిర్మాణానికి, వికసిత్ భారత్ లక్ష్యానికి ఎలా దోహదపడతాయో విద్యార్థులు ఆలోచించేలా ఈ కార్యక్రమాలు ప్రోత్సహిస్తాయని తెలిపారు. ఈ రెండు కోర్సుల ద్వారా విద్యార్థుల విద్యా, వృత్తిపరమైన అభివృద్ధితో పాటు వ్యక్తిగత శ్రేయస్సు, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యానికి ఐఐటీ హైదరాబాద్ ప్రాధాన్యతనిస్తోంది. సాంకేతిక విద్యతో పాటు మానవీయ విలువలను పెంపొందించే దిశగా ఈ కార్యక్రమాలు కీలక ముందడుగుగా నిలవనున్నాయి.

తుక్కుగూడ శ్రీశైలం హైవే, అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ ఉక్కుపాదం...!

టీపీవో సంతోష్ సింగ్ దూకుడు --- ఫుట్‌పాత్ ఆక్రమణలు నేలమట్టం....!

ఎలాంటి నోటీసు ఇవ్వకుండా...కూల్చడం పై ఆగ్రహం వ్యక్తం చేసిన వ్యాపారులు...

మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): మహేశ్వరం. నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని తుక్కుగూడ వార్డులో శ్రీశైలం హైవేపై అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. శంషాబాద్ జోన్ టీపీవో సంతోష్ సింగ్ ఆధ్వర్యంలో బుధవారం భారీ కూల్చివేత చేపట్టారు.

100 ఫీట్ల రోడ్డు ఆక్రమణ..

100 ఫీట్లు ఉండాల్సిన శ్రీశైలం ప్రధాన రహదారికి ఇరువైపులా కొందరు వ్యాపారులు ఫుట్ పాత్ ను ఆక్రమించి ఇష్టానుసారంగా రేకుల షెడ్లు, తాత్కాలిక నిర్మాణాలు వేశారు. దీంతో వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. హైవేపై నిత్యం ట్రాఫిక్ జామ్ లు, చిన్న చిన్న రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని స్థానికులు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు టీపీవో సంతోష్ సింగ్ రంగంలోకి దిగారు.శంషాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు ఆదేశాల మేరకు టీపీవో సంతోష్ సింగ్ ఆధ్వర్యంలో నాలుగు జేసీబీలతో బుధవారం ఉదయం





నుండే కూల్చివేతలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసు బలగాలను మోహరించారు. క్షేత్రస్థాయిలో స్వయంగా నిలబడి టీపీవో సంతోష్ సింగ్ కూల్చివేతలను పర్యవేక్షించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ షెడ్లన్నింటినీ నేలమట్టం చేశారు.

నోటీసులు లేకుండా ఎలా కూలుస్తారంటూ వ్యాపారుల ఆందోళన:

కూల్చివేత సమయంలో వ్యాపారులు అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పండగ సమయంలో కనీసం ముందస్తు నోటీసు కూడా ఇవ్వకుండా ఇలా కూల్చేయడం అన్యాయం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మాకు లక్షల్లో నష్టం వాటిల్లింది, మా గోడు ఎవరికి చెప్పుకోవాలి అంటూ వాపోయారు.

టీపీవో సంతోష్ సింగ్ వివరణ: దీనిపై టీపీవో సంతోష్ సింగ్ స్పందిస్తూ.. ఇది వారి ప్రైవేట్ స్థలం కాదు, ప్రభుత్వ రోడ్డు స్థలం అని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాన్ని పర్మిషన్ లేకుండా ఆక్రమించినప్పుడు నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. 100 ఫీట్ రోడ్డును కాపాడటం, వాహనదారులకు, పాదచారులకు సౌకర్యం కల్పించడం కోసమే ఈ చర్యలు తీసుకుంటున్నామని, అక్రమ కట్టడాలు ఎక్కడ ఉన్నా సహించేది లేదని హెచ్చరించారు. ఈ కూల్చివేతలు నిరంతరం కొనసాగుతాయని, వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

కార్నాటి కృష్ణయ్య 28వ వర్ధంతి సభను జయప్రదం చేయాలి

కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్ పిలుపు



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, పేద ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన కామ్రేడ్ కార్నాటి కృష్ణయ్య 28వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 17వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు నేలకొండపల్లిలోని కార్నాటి కృష్ణయ్య స్తూపం వద్ద వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్నాటి కృష్ణయ్య భూమి, భుక్తి, విముక్తి కోసం సాగించిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కర్నాటి భాను ప్రసాద్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. వర్ధంతి సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ వర్ధంతి సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి దండి సురేష్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, కసకబండి సీతారాములు పాల్గొన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.